నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
ఆదివారం 19 మే 2024 పేజీలు 8
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు

# ప్రభాకర్ రెడ్డి V/S విజయసాయి రెడ్డి

**-గెలుపు ఎవరిది...?**
**-గెలుపు పై పందేలు**
**-మెజారిటీ పై కోట్లు**


వేమిరెడ్డి. ప్రభాకర్ రెడ్డి
తెలుగుదేశం పార్టీ ఎం. పి. అభ్యర్థి


వేణుంభాక. విజయసాయిరెడ్డి,
వైస్సార్సీపీ ఎం.పి అభ్యర్థి

**నెల్లూరు ప్రతినిధి, మూరంరెడ్డి సుబ్బారెడ్డి (మేజర్ న్యూస్)**

**సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసి రోజులు జరిగే కొద్దీ ఫలితాలు పై ఒక్కరి ఒక్కరు సై అంటూన్నారు. తమదే గెలుపని ఒక అభ్యర్థి వర్గం మీసాలు మెలి వేస్తుంటే తమ అభ్యర్థి కి మెజారిటీ మూడు లక్షలకు పై మాటే అంటూ మరో అభ్యర్థి వర్గం తొడలు కొట్టుతుంది.**

నెల్లూరు పార్లమెంట్ కూటమి అభ్యర్థి గా తెలుగుదేశం పార్టీ నేత వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, వైస్సార్సీపీ అభ్యర్థి గా వేణుంభాక విజయసాయి రెడ్డి లు ఎన్నికల్లో ప్రధానం గా తలపడ్డారు. వీరు ఇద్దరు దేశ రాజధాని ఢిల్లీ లో సైతం చక్రం తిప్ప గల సమర్ధులు. ఇరువురు కి రాజ్య సభ సభ్యులు గా పని చేసిన అనుభవం ఉంది. ప్రత్యేక్ష రాజకీయాలలో ఎన్నికల్లో పోటీ చేయడం ఇరువురి కి ఇదే తొలిసారి. నెల్లూరు పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతం రికార్డ్ గా 79. 05 శాతం నమోదు అయింది. దీంతో ఇరువురి మధ్య గెలుపు పై ప్రధానం గా చర్చలు జరుగుతున్నాయి.

**గెలుపు పై పందెలు.......**

వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, వేణుంభాక విజయసాయి రెడ్డి లలో ఎవరు గెలుస్తారనే దాని పై జోరుగా పందెలు జరుగుతున్నాయి. పెరిగిన ఓటింగ్ శాతం, ప్రభుత్వ వ్యతిరేకత తమ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి విజయం తథ్యమని ఆయన వర్గం పందెలు కు సిద్దమైనారు. సంక్షేమ పథకాలు తమ అభ్యర్థి వేణుంభాక విజయసాయి రెడ్డి విజయం ఖాయమని ఆయన వర్గం సైతం పందెలకు దిగుతున్నారు. జిల్లా లో ఎక్కడ పట్టిన వీరి గెలుపు పై పందెలు, చర్చలు జరుగుతున్నాయి. పందెలు కాసేవారు ఎక్కువ మంది వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి వైపు మొగ్గు చూపుతున్నారు.

**మెజారిటీ పై కోట్లు........**

గెలుపు పందెలకు వేణుంభాక విజయసాయి రెడ్డి వైపు నుంచి పెద్దగా రాకపోవడం తో వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి వర్గం మెజారిటీ పై పందెం కాసేందుకు సిద్దమైంది. తమ నేత వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మూడు లక్షల మెజారిటీ తో గెలుస్తారని పందెలకు దిగ్గడం తో పందెం కాసేందుకు వేణుంభాక విజయసాయి రెడ్డి వర్గం సైతం పందెలకు దిగుతున్నట్లు సమాచారం. మెజారిటీ పై పందెం కాయడం తో విజయసాయి రెడ్డి పై పందెలు జోరుగా రావడం తో వేమిరెడ్డి వర్గం సైతం సై అనడంతో పందెలు కోట్ల లో చేరుకున్నాయని సమాచారం. జూన్ 4 న ఓట్ల లెక్కింపు రోజుకు ఈ పందెలు ఇంకెన్ని కోట్లు చేరుకుంటాయోనని చర్చ జరుగుతుంది. పందెలు వేసిన వారి భవిత ఎలా ఉంటుందోనని జూన్ 4వ తేదీ కి ఎవ్వరు కోటేశ్వరులు అవుతారో... ఎవరూ బికారులవుతారోనని జిల్లా ప్రజలు ఎదురు చూస్తున్నారు.

## మహిళలపై దాడులకు పాల్పడితే... ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదు

**-వింజమూరు లో తల్లీ కూతురు ల దాడి ఘటన పై మహిళ కమిషన్ సీరియస్.**

**-గజ్జల వెంకటలక్ష్మి చైర్పర్సన్ మహిళా కమిషన్**



**వింజమూరు (మేజర్ న్యూస్)**నెల్లూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువతి ని వారి తల్లిని పరామర్శించిన మహిళా కమిషన్ చైర్ పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి అనంతరం మీడియాతో మాట్లాడుతూఈ ఘటనపై జిల్లా ఎస్పీతో మాట్లాడడం జరిగిందనివింజమూరులో తల్లి కూతుర్ల పై దాడి దారుణం అని తెలిపారుకొంతకాలంగా యువతి ని ప్రేమిస్తున్నానంటూ వేధింపులకు పాల్పడుతున్న నాగరాజు శుక్రవారం యువతి, యువతి తల్లి పై దాడి చేయడం జరిగిందన్నారు.తల్లి కూతుర్లను ఆసుపత్రికి తరలించి, ప్రభుత్వం సాయంతో చికిత్స అందిస్తున్నాం.ప్రాణభయముతో తల్లి కూతుర్లు ఉన్నారు, వారికి భద్రత కల్పిస్తామని భరోసా ఇచ్చారు.పరారీలో ఉన్న నిందితుడిని త్వరగా పట్టుకోవాలని, శిక్షలు పడేలా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీకి సూచించారు.ఎన్నికల కోడ్ అమలులో వచ్చిన తర్వాతే మహిళపై దాడులు పెరిగాయిఈ వరుస సంఘటనపై మహిళా కమిషన్ చర్యలు చేపట్టకుండా ఈసీ ఆంక్షలు విధించడం సరికాదన్నారు.బాధితులకు మహిళా కమిషన్, ప్రభుత్వము అండగా ఉంటుంది – రక్షణ కల్పిస్తుంది.బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని, అనంతరం ప్రభుత్వ షెల్టర్ హోమ్ కు తరలించాలని అధికారులకు సూచించారు.

## ఘరానా దొంగ అరెస్టు

**- 44 సవర్ల బంగారం స్వాధీనం**

**- నగర డిఎస్పి శ్రీనివాసులు రెడ్డి**



**నెల్లూరు క్రైం ( మేజర్ న్యూస్)**నగరంలోని పలు ప్రాంతాల్లో తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ దొంగతనాలకు పాల్పడుతున్న దొంగను బాలాజీ నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 44.5 సవర్ల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు నగర డిఎస్పి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం బాలాజీ నగర్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నగర డిఎస్పి దొంగతనాలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. వెంకటేశ్వరపురం జనార్ధన్ రెడ్డి కాలనీ) ప్రాంతానికి చెందిన మీదూరి సునీల్ అనే వార్త నేరస్థుడు గతంలో పలు దొంగతనాలు కేసుల్లో జైలుకెల్లి వచ్చాడు. బయటికి వచ్చిన తర్వాత తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకొని రాత్రిపూట దొంగతనాలకు పాల్పడుతూ పోలీసులకు చిక్కకుండా తప్పించుకొని తిరుగుతున్నాడని డిఎస్పి చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానంతో పాత నేరస్థుడుపై నిఘా ఉంచిన బాలాజీ నగర్ సిఐ వీర నాయక్ ఆధ్వర్యంలో దొంగ ను అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. అతను వద్ద నుంచి 44 సవర్ల బంగారాన్ని స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపరచడం జరిగిందన్నారు. ఇది ఇలా ఉండగా వేసవి సెలవులు నేపథ్యంలో బయట ఊర్లకు వెళ్లే ప్రజలు జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో ఉచితంగా అందిస్తున్న ఎల్ హెచ్ ఎం ఎస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని నగర డిఎస్పీ కోరారు. దొంగను అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని డిఎస్పి ప్రత్యేకంగా అభినందించారు . ఈ సమావేశంలో సీఐ వీరా నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

## స్ట్రాంగ్ రూముకు పోస్టల్ బ్యాలెట్ లు



**నెల్లూరు (మేజర్ న్యూస్)** నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించి పోస్ట్ లో వచ్చిన పోస్టల్ బ్యాలెట్ లను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నెల్లూరు కలెక్టరేట్ లో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్ లో ఉంచి సీలు వేశారు. శనివారం పోస్ట్ లో వచ్చిన పోస్టల్ బ్యాలెట్ కవర్లను పోస్టల్ సిబ్బంది కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ ఎం హరి నారాయణన్ కు అందజేశారు. ఈ పోస్టల్ బ్యాలెట్ లను ట్రంక్ పెట్టెలో భద్రపరిచి సీలు వేశారు. అనంతరం స్ట్రాంగ్ రూములో బాక్సులను ఉంచి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్ కు తాళాలు వేసి సీలు వేశారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి డిఆర్ఓ బాపిరెడ్డి, వైఎస్ఆర్సిపి ప్రతినిధి సుబ్బారాయుడు, టిడిపి ప్రతినిధి కృష్ణ చైతన్య పాల్గొన్నారు.



**దేశవ్యాప్తంగా విగ్రహాలతో పాటు ఇలాంటి అభాగ్యుల జీవితాలను కూడా బాగు చేయాల్సిన అవసరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంది. విగ్రహాలను డెవలప్ చేస్తే ఇండియా వెలిగిపోతుందా......?ఇలాంటి అబాగ్యుల జీవితాలను డెవలప్ చేస్తే అదే మొత్తం ఖర్చులతో ఇండియా వెలుగుతోందా....? ఆలోచించండి..**

**...విద్యాలయాల డెవలప్మెంట్ దిశగా భారత దేశ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడుగులు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.**

సూర్య మేజర్ న్యూస్ క్లిక్

ఏఎస్‌ఓ, బ్యాంక్ ఎగ్జామ్ స్పెషల్

# ఆర్థిక గణాంకశాస్త్రము

## ప్రాథమిక అంశాలు

ప్రస్తుత పోటీ పరీక్షలలో విజయం సాధించాలంటే ఆర్థిక మరియు గణాంక శాస్త్రాల ప్రాముఖ్యత గురించి బాగా చదవాలి.

అర్ధశాస్త్రములో గణాంకశాస్త్ర పరిధి ఎలా ఉంటుంది? అర్ధశాస్త్ర పరిధితో పాటు ఒకవ్యక్తి, సంస్థ లేదా దేశం యొక్క స్థితిగతులను ఒకక్రమ పద్ధతిలో అభివృద్ధి స్థాయిలో నడిపించగలిగేదే గణాంకశాస్త్రం. ఇందులో ప్రాథమిక అంశాలను గురించి పూర్తి వివరాలను ఇస్తున్నాము.

**ప్రాథమిక దత్తాంశం :**

- ఒక నిర్ణీత విషయసేకరణ ఉద్దేశ్యంతో మొదటగా సేకరించబడిన దత్తాంశమును ప్రాథమిక దత్తాంశం అంటారు.

**ద్వితీయ దత్తాంశం:**

- ప్రాథమిక దత్తాంశం నుండి ఇతర అంశాల పరిశీలనకు తీసుకున్న దత్తాంశ భాగాలను ద్వితీయ దత్తాంశం అంటారు.

**దత్తాంశ సేకరణ :**

- గణాంక విచారణ యొక్క లక్ష్యాలను నెరవేర్చుటకు అవసరమైన సమాచారమును సేకరించుటను దత్తాంశ సేకరణ అంటారు.

**శాంపిల్ :**

- గణాంక అధ్యయనం కొరకు జనాభా నుండి తీసుకున్న లేక తీసుకొనుటకు నిర్ణయించిన సంఖ్యను లేక యూనిట్‌ను శాంపిల్ అంటారు.

**జనాభా :**

- గణాంక శోధన యొక్క పరిధి యందు కలిసి ఉన్న మొత్తం పరిశీలనలను జనాభా అంటారు.

**స్తరితము :**

- స్తరిత యాదృచ్ఛిక ప్రతిచయన విధానములోని జనసంఖ్యలోని వివిధ యూనిట్లను గ్రూపులుగా విభజిస్తారు. ఈ విధంగా విభజించిన ప్రతిగ్రూపును స్తరితము అంటారు.

**కోటా ప్రతిచయనం :**

- జనాభాను వివిధ సమూహాలుగా విభజించిన వాటిని కోటా అంటాము. ఆ సమూహాలను వివిధ గణికులకు కేటాయించి వారిని ఈ కోటాలోని అంశాలకు లోబడి, వారినుండి దత్తాంశాన్ని సేకరించు విధానమును కోటా ప్రతిచయనం అంటారు.

**యాదృచ్ఛిక ప్రతిచయనం :**

- జనాభాలోని ప్రతి అంశానికి లేక ఒక యూనిట్‌కు ప్రతిచయనం నందు భాగము పంచుకొనుటకు అవకాశము ఉండు విధానమును యాదృచ్ఛిక ప్రతిచయనం అంటారు.

**వర్గీకరణ :**

- దత్తాంశాన్ని గ్రూపులుగా లేక తరగతులుగా విభజించు ప్రక్రియను వర్గీకరణ అంటారు.

**గణాంక దోషం :**

- వాస్తవ విలువలకు, అంచనా విలువలకు గల తేడాను గణాంక దోషం అంటారు.

**వ్యక్తిగత పరిశీలనలు :**

- వివిధ అంశాల విలువలను ఒకదాని తరువాత మరియొక దానిని వ్యక్తిగతంగా చూపిన యెడల వాటిని వ్యక్తిగత పరిశీలనలు అంటారు.

**కాలశ్రేణులు :**

- ఒక విషయానికి సంబంధించి వివిధ కాలాలు లేక సంవత్సరాల యొక్క గణాంకాల శ్రేణిని కాలశ్రేణులు అంటారు.

**విచ్ఛిన్న శ్రేణులు :**

- ఈ విధానంలో దత్తాంశములోని చలనాలను విచ్ఛిన్న సంఖ్యల క్రింద వేరువేరుగా చూపుతారు. వ్యాప్తి దృష్టిలో వాటిని గ్రూపులుగా విభజించరు.

**అవిచ్ఛిన్న శ్రేణులు :**

- వ్యాప్తి భావంలో దత్తాంశాన్ని తెలుపుతారు. అనగా గ్రూపులుగా తరగతి అంతరాలు ఉండునట్లు విభజించి చూపుతారు.

**మధ్యవిలువ :**

- అవిచ్ఛిన్న శ్రేణులందు తరగతి యొక్క ఎగువ మరియు దిగువ హద్దుల సగటును మధ్యవిలువ అంటారు.

**తరగతి అంతరం :**

- దత్తాంశములోని ప్రతి తరగతి యొక్క కొలతను తరగతి అంతరం అంటారు.

**తరగతి పౌనఃపున్యము :**

- ఒక నిర్ణీత తరగతి నందు ఉన్న పరిశీలనల సంఖ్యను తరగతి పౌనఃపున్యము అంటారు.

**సంచిత పౌనఃపున్యము :**

- ముందున్న తరగతుల మొత్తం పౌనఃపున్యానికి ఈ తరగతి పౌనఃపున్యము కలిపితే వచ్చేది సంచిత పౌనఃపున్యము అవుతుంది.

**ప్రశ్నావళి:**

- ఒక శోధనకు పరిమితం అయినటువంటి ప్రశ్నల జాబితాను ప్రశ్నావళి అంటారు. దీనియందు ప్రశ్నలు ఉండి, జవాబులు వ్రాయుటకు ఖాళీ ఉంటుంది.

**పట్టీకరణ :**

- నిలువ మరియు అడ్డువరుసలందు గల సంఖ్యా దత్తాంశమును ఒక చక్కని పద్ధతిలో అమర్చుటను పట్టీకరణ అంటారు.

**బారుచిత్రాలు :**

- వీటిని ఏక పరమాణు చిత్రాలు అంటారు. ఎందుకనగా దత్తాంశాన్ని చూపుటకు లేక వివరించుటకు వాటి పొడుగును మాత్రమే పరిగణనలోనికి తీసుకుంటారు.

**ద్విపరిమాణ చిత్రాలు:**

- ఒక బార్ యొక్క పొడవుతో పాటు వాటి వెడల్పును కూడా పరిగణనలోనికి తీసుకున్నట్లయితే వాటిని ద్విపరిమాణ చిత్రాలు అంటారు.

**కార్టోగ్రామ్:**

- ఈ పద్ధతి నందు గణాంక యదార్థాలను రేఖా చిత్రాలు మరియు యాప్‌ల సహాయంతో వివరిస్తారు.

**'పై' రేఖాచిత్రం :**

- ఉప విభాజిత వృత్తాన్ని 'పై' లేక కోణీయ చిత్రం అంటారు. ఈ తరహా చిత్రాలను దత్తాంశం యొక్క మొత్తం విలువలతో పాటుగా వాటియందు ఇమిడి ఉన్న అన్నిరకాల అంశాలను చూపుటకు ఉపయోగిస్తారు.

**బహుళ బార్ చిత్రాలు :**

- ఒక దానితో మరొకటి సంబంధమున్న దత్తాంశాన్ని, ఒక సమాచారాన్ని సమర్పించుటకు ఒకదాని ప్రక్కన మరొకటి బార్‌లుగా చిత్రాలను ఉపయోగిస్తారు. దీనినే బహుళ బార్ చిత్రాలు అంటారు.

**రేఖాచిత్రం:**


- రేఖాచిత్రం ఆధారంగా దత్తాంశ సమర్పణను రేఖాచిత్రం అంటారు. పౌనఃపున్య విభాజనమును రేఖాచిత్రం ద్వారా సమర్పించినచో దానిని పౌనఃపున్య విభాజన రేఖాచిత్రం అంటారు.

**సోపానచిత్రం :**

- దత్తాంశములోని తరగతులను వెడల్పుగా, పౌనఃపున్యాలను పొడవులుగా తీసుకొని గీచిన దీర్ఘచతురస్రాల సముదాయాన్ని సోపానచిత్రం అంటారు.

**ఓజివ్ రేఖ :**

- దత్తాంశములోని వివిధ తరగతుల సంచిత పౌనఃపున్యాలను ఆధారంగా చేసుకొని గీయబడిన రేఖను సంచిత పౌనఃపున్య రేఖ లేక ఓజివ్ రేఖ అంటారు.




ద్విపరిమాణ చిత్రాలు అంటే...?

**ఫ్రీక్వెన్సీ పాలిగన్ :**

- సోపాన చిత్రంలోని ఒక దీర్ఘచతురస్ర మధ్య బిందువును, ప్రక్క దీర్ఘచతురస్ర మధ్య బిందువుతో కలుపుతూ గీయబడిన రేఖను ఫ్రీక్వెన్సీ పాలిగన్ అంటారు.

**బాండ్ గ్రాఫ్ :**

- ఒక చలనము యొక్క పూర్తి విలువను చూపుటకు ఉపయోగించిన ఒక రేఖను, ప్రతి కాలవ్యవధిని వేరువేరుగా చూపుటకు వీలుగా దానిని ప్రతి కాల వ్యవధి అంతానికి విభజించిన యెడల ఆ రేఖను బాండ్‌గ్రాఫ్ అంటారు.

**నిష్పత్తి స్కేల్ :**

- దత్తాంశములోని అనుపాత లేక సాపేక్ష మార్పులను చూపుటకు సాధారణ స్కేలు కాకుండా సంవర్గమాన స్కేలును ఉపయోగిస్తారు. దీనినే నిష్పత్తి స్కేలు అంటారు.

**మిథ్యాధార రేఖ :**

- కొన్ని సమయాలందు దత్తాంశములోని విలువలు చాలా ఎక్కువ పరిమాణంలో ఉన్నప్పుడు అనగా కనిష్ఠ విలువే చాలా ఎక్కువగా ఉన్నప్పుడు, ఆ కనిష్ఠ విలువ రేఖాచిత్రంపై మూలబిందువు నుండి చాలా దూరంలో ఉంటుంది. అందువలన దత్తాంశంలోని విలువ నుండి స్కేలును గీయవచ్చు. అటువంటి సందర్భాలలో మూలబిందువు పైన 'ఎక్స్' అక్షానికి సమాంతరంగా పంక్తుల గీతలు గీస్తారు. దీనిని మిథ్యారేఖ అంటారు.

**అంకగణిత సగటు :**

- ఒక శ్రేణిలోని విలువల మొత్తాన్ని ఆ విలువల సంఖ్యచే భాగించిన యెడల వచ్చిన భాగఫలాన్ని అంకగణిత సగటు అంటారు.

**భారిత సగటు :**

- దత్తాంశములోని వివిధ అంశాలకు వాటి ప్రాధాన్యతను బట్టి భారాలను ఇస్తూ గణన చేయబడిన సగటును భారిత సగటు అంటారు.

**దశాంశాలు :**

- దత్తాంశాన్ని ఆరోహణ లేక అవరోహణక్రమంలో అమర్చినపుడు దానిని 10 సమాన భాగాలు చేసే 9 బిందువులను దత్తాంశాలందురు.

**శతాంశాలు :**

- దత్తాంశాన్ని ఆరోహణ లేక అవరోహణ క్రమంలో అమర్చినపుడు దానిని 100 సమాన భాగాలు చేసే 99 బిందువులను శతాంశాలు అంటారు.

**బాహుళకము :**

- దత్తాంశములో ఎక్కువసార్లు కనిపించే విలువను ఎక్కువ పౌనఃపున్యమును కలిగిన విలువవను బాహుళకము అంటారు.

**గుణమధ్యమము :**

- ఎన్ అంశాల ఎన్ వ మూలాన్ని గుణ మధ్యమము అంటారు.

**హరమధ్యమము :**

- ఇచ్చిన విలువల వ్యుత్క్రమాల అంకగణిత సగటు యొక్క వ్యుత్క్రమాన్ని హరమధ్యమము అంటారు.

**వ్యాప్తి:**

- ఒక శ్రేణిలోని అత్యధిక, అత్యల్ప విలువల మధ్య గల తేడాను వ్యాప్తి అంటారు.

**అంతర్ చతుర్థాంశ వ్యాప్తి :**

- ఎగువ, దిగువ చతుర్థాంశాల మధ్య గల తేడాను అంతర్ చతుర్థాంశ వ్యాప్తి అంటారు.

**చతుర్థాంశ విచలనం :**

- ఎగువ, దిగువ చతుర్థాంశాల బేధం యొక్క సగటును చతుర్థాంశ విచలనం అంటారు.

**విస్తరణ :**

- ఒక సగటు చుట్టూ విస్తరించి ఉన్న సంఖ్యాదత్తాంశం యొక్క కొలమానాన్ని దత్తాంశం యొక్క విస్తరణ అంటారు.

**మాధ్యమిక విచలనం :**

- అంకమధ్యమం లేక మధ్యగతం నుండి ప్రతి విలువకు గల విచలనాల ధన, ఋణ గుర్తులను వదిలివేస్తూ నిర్ణయించబడిన సగటును మాధ్యమిక విచలనం అంటారు.

**ప్రామాణిక విచలనం :**

- అంకమధ్యమం నుండి వచ్చిన విచలనాల వర్గాల యొక్క సగటును వర్గమూల విలువలను ప్రామాణిక విచలనం అంటారు.

**విచరణ :**

- ఆర్.ఏ. పిషర్ ప్రకారం విచరణ అనగా ప్రామాణిక విచలనం యొక్క వర్గాన్ని విచరణ అంటారు.

**విచరణ గుణకం :**

- ప్రామాణిక విచలనాన్ని అంకమధ్యమంచే భాగించి దానికి 100చే గుణించగా లభించే విలువను విచరణ గుణకం అంటారు.

**వైషమ్యం :**

- విభాజకము యొక్క స్వభావాన్ని, రూపురేఖను తెల్పునదే వైషమ్యం.

**మాధ్యమిక విచలన గుణకం :**

- మాధ్యమిక విచలనాన్ని సగటుచే భాగించగా లభించునదే మాధ్యమిక విచలన గుణకం.

**స్కాటర్ పటాలు :**

- రెండు దత్తాంశాల మధ్య గల సంబంధమును చూపించినంతనే తెలుసుకో గల పటాలను స్కాటర్ పటాలు అంటారు.

# కోవూరు నియోజకవర్గం

## శ్రీవేదగిరి లక్ష్మి నరసింహస్వామి హంస వాహనం పై భక్తులకు దర్శనం.





**నెల్లూరు కల్చరల్ (మేజర్ న్యూస్):**శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా నరసింహకొండ పై వేంచేసియున్న శ్రీ వేదగిరి లక్ష్మి నరసింహస్వామి వారి దేవస్థానం నందు శనివారం నాడు ఉదయం చప్పర ఉత్సవం గిరి ప్రదక్షిణ కార్యక్రమం , కార్యక్రమాలు ప్రధాన అర్చకులు భాస్కరా చార్యులు ఆద్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణ ల మధ్య వైభవంగా జరిగాయి .ఉభయ కర్తలుగా కలివెలపాళెం వాస్తవ్యులు తిరువీధి వెంకట నరసింహరావు-లక్ష్మి వ్యవహరించగా , అనంతరం స్వామి వారు భక్తులకు హంస వాహనం పై దర్శనం ఇచ్చారు.

పై పూజ కార్యక్రమాలు లో కార్యనిర్వహణాధికారి వి గిరికృష్ణ ,అర్చక సిబ్బంది ,దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు. శ్రీ వేంకటేశ్వర ఆర్ట్స్ అకాడమీ వారిచే భరత నాట్యం ,శ్రీ విఘ్నేశ్వర నాట్య మండలి వారిచే రామాంజనేయ యుద్ధ శీను ,మధుప్రియ నాట్య మండలి చే మయసభ శీను భక్తులను అలరించాయి.శనివారం కూడా కావడం తో భక్తులు ఆదిక సంఖ్య లో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

## కౌంటింగ్ ఏర్పాట్లను ప్రణాళికాబద్ధంగా నిర్వహించండి

**- రిటర్నింగ్ అధికారి వికాస్ మర్మత్, ఐ.ఏ.యస్.,**



**నెల్లూరు కార్పొరేషన్ (మేజర్ న్యూస్)**సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో 117 సిటీ నియోజకవర్గంలో జరగనున్న కౌంటింగ్ ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని రిటర్నింగ్ అధికారి వికాస్ మర్మత్ ఐ.ఏ.యస్. ఎన్నికల అధికారులకు సూచించారు. కార్పొరేషన్ లోని ఆయన ఛాంబర్ లో శనివారం నిర్వహించిన సదస్సులో మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియను పటిష్టంగా, పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

## ఈనెల 22న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ జిల్లా పర్యటన

### విక్రమసింహపురి యూనివర్శిటీ స్నాతకోత్సవంలో పాల్గొననున్న గవర్నర్



**నెల్లూరు, (మేజర్ న్యూస్)**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఈనెల 22న జిల్లా పర్యటనకు విచ్చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం హరినారాయణన్ ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటాచలం మండలం కాకుటూరులోని విక్రమ సింహపురి యూనివర్శిటీ స్నాతకోత్సవ వేడుకల్లో గవర్నర్ పాల్గొంటారు. ఈనెల 22వ తేదీ ఉదయం 9.45 గంటలకు గన్నవరం ఎయిర్పోర్టు నుంచి హెలికాప్టర్లో బయలుదేరి ఉదయం 10.40 గంటలకు నెల్లూరు పోలీసుపరేడు మైదానానికి గవర్నర్ చేరుకుంటారు. ఉదయం 11.30 గంటలకు విక్రమసింహపురి యూనివర్శిటీలో నిర్వహించే స్నాతకోత్సవ వేడుకల్లో గవర్నర్ పాల్గొంటారు. మధ్యాహ్నం 12.55 గంటల వరకు విక్రమ సింహపురి యూనివర్శిటీ స్నాతకోత్సవ వేడుకల్లో గవర్నర్ పాల్గొంటారు. అనంతరం సాయంత్రం 5.35 గంటలకు పోలీసుపరేడు మైదానం నుంచి హెలికాప్టర్:లో బయలుదేరి గన్నవరం ఎయిర్పోర్టుకు చేరుకుంటారు.

## ఏఎస్పేట క్రాస్‌రోడ్ వద్ద షెల్టరు నిర్మించాలి



**ఆత్మకూరు,మేజర్న్యూస్:** నెల్లూరూముంబాయి జాతీయరహదారిపై ఆత్మకూరు సమీపంలోని ఏఎస్పేట క్రాస్‌రోడ్డు వద్ద ఒక బస్‌షెల్టరు నిర్మించాలని జనాలు పదేపదే కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఏఎస్పేటలో శ్రీశ్రీశ్రీ ఖాజారహమతుల్లానాయబ్‌రసూల్ దర్గా ఉండడంతో ప్రముఖ యాత్రాకేంద్రంగా ఉంటూ ప్రతి శుక్రవారం వందలాదిగా ఏడాదికొకదపా జరిగే గంధమహోత్సవం సందర్భంగా లక్షలాది మంది ప్రయాణీకులు విచ్చేస్తుంటారు. అదీగాక మండలకేంద్రం కావడంతో గ్రామాల నుండి పలువురు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అది కూడలి కావడంతో బస్సులు మారే ప్రయాణీకులు అక్కడ వేచి ఉండేందుకు బస్‌షెల్టరు అత్యంతావశ్యకం కాగా పదేపదే ప్రయాణీకులు కోరుతూనే ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అత్యంత ప్రాధాన్యత కలిగిన ,మండలకేంద్రమైన ఏఎస్పేటకు రాకపోకలు సాగించే ప్రయాణీకుల కోసం ఒక బస్‌షెల్టరు నిర్మించేందుకు ప్రాధాన్యతాక్రమంలో సంబంధిత అధికారులు స్పందించాలని, చర్యలు తీసుకోవాలని వివిధ ప్రాంతాల నుండి వచ్చే ప్రయాణీకులు కోరుకుంటున్నారు.

### అంతరిక్షం..అవకాశాల అద్భుతం



**బుచ్చిరెడ్డిపాలెం మేజర్ న్యూస్:**–అంతరిక్షం అవకాశాల అద్భుతం అని బుచ్చిరెడ్డిపాలెం శాఖా గ్రంథాలయ అధికారిణి కే.మంజులత అన్నారు. బుచ్చిరెడ్డిపాలెం శాఖా గ్రంధాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో శనివారం అంతర్జాతీయ ఖగోళ శాస్త్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంతరిక్ష రంగంలో విశిష్ట సేవలు అందించిన కలాం, సునీత విలియమ్స్, రాకేష్ శర్మ వంటి మహోన్నతుల గురించి విద్యార్థులకు వివరించారు. "ఖగోళ శాస్త్రంలో భారతీయుల పాత్ర " అనే అంశంపై విద్యార్థులకు పలురకాల పోటీలు నిర్వహించి బహుమతులుఅందజేశారు. నేటితో భారతావని అణుపరీక్షలు నిర్వహించి 50 ఏళ్ళు పూర్తి అయిన సందర్భంగా ఫోక్రాన్-1, ఫోక్రాన్-2 గురించి విద్యార్థులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ గ్రూపు సభ్యులు గండికోట సుధీర్‌కుమార్,గ్రంధపాఠకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

### బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందికి తెనేటి విందు



**బుచ్చిరెడ్డిపాలెం మేజర్ న్యూస్:**–సాధారణ ఎన్నికలు 2024 ప్రక్రియలో భాగంగా బుచ్చిరెడ్డిపాలెం నగరపంచాయితీ పరిధిలోని 41 పోలింగ్ స్టేషన్లు వద్ద నగరపంచాయతీ పారిశుధ్య సిబ్బంది పారిశుధ్యం పరంగా మెరుగైన సేవలు అందించినందుకు, పోస్టల్ బాలేట్ ఓటింగ్ నిర్వహించు సమయంలో మరియు డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద సమర్థవంతంగా పారిశుధ్య పనులు నిర్వహించి, బుచ్చిరెడ్డిపాలెం ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పట్టణంలో కూడా పారిశుద్ధ్య సేవలు అందించినందుకు నగర పంచాయతి కమిషనరు గారు పారిశుధ్య సిబ్బందికి తేనెటీ విందు ఏర్పాటు చేసి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియచేశారు.

### గ్రంథాలయాలు....విజ్ఞాన కేంద్రాలు.



**విడవలూరు మేజర్ న్యూస్.**గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని మండల కేంద్రమైన విడవలూరు గ్రంధాలయ నిర్వహకురాలు నిరూప అన్నారు . వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గ్రంధాలయంలో శనివారం పిల్లలకు కథలు చెప్పడం కథలు చదివించడం కథలు వినిపించడం మరియు ఆటలు పలు కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ వేసవి విజ్ఞాన శిబిరాలు ఈనెల 15వ తేదీ నుంచి వచ్చే నెల 7వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. కావున విడవలూరు గ్రామ ప్రజలు తమ పిల్లలను వేసవి విజ్ఞాన శిబిరాలకు పంపించి వారి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించే దానికి సహాయపడాలని కోరారు.

# స్కేటింగ్‌లో ప్రతిభచూపిన చిన్నారి ధృతి






## -జాతీయస్థాయి పతకం కైవసం

**ఆత్మకూరు,మేజర్‌న్యూస్:** ఆత్మకూరుకు చెందిన పల్లె ధృతి అనే ఆరేళ్ళ చిన్నారి స్కేటింగ్‌లో అత్యంత ప్రతిభ చూపి జాతీయస్తాయిలో వెండి పతకాన్ని కైవసం చేసుకోగా సర్వత్రా ఆమె ప్రతిభను కొనియాడుతున్నారు. ఆత్మకూరుకు చెందిన మల్లవరపు జయేంద్రప్రసాద్‌రెడ్డి మనుమరాలు, కె.కృష్ణారెడ్డి-పావనిల కుమార్తె ధృతి 1వతరగతి చదువుతుండగా స్కేటింగ్‌లో తర్ఫీదు పొందింది. ఈ చిన్నారి నియోజకవర్గ, డివిజన్, జిల్లాస్థాయిలో స్కేటింగ్ పోటీల్లో పాల్గొని ప్రథమస్థానం పొంది వెండి పతకాన్ని పొందింది. విశాఖపట్టణంలో జరిగిన రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీల్లో కూడా ఆమె పాల్గొని ప్రథమస్థానం పొందింది. కాగా ఈనెల16వతేదీన గోవాలో ఇండియన్‌స్కేట్ ఆధ్వర్యంలో నేషనల్ ఓపెన్ రోలర్‌స్కేటింగ్ చాంపియన్‌షిప్2024 జాతీయపోటీల్లో అండర్5-7 విభాగంగా ధృతి పాల్గొని అత్యంత ప్రతిభ కనబరిచి జాతీయస్థాయిలో ద్వితియస్థానం పొంది వెండి పతకాన్ని కైవసం చేసుకొంది. ఆరేళ్ళ వయసుగల 1వతరగతి చదువుతున్న చిన్నారి ధృతి స్కేటింగ్‌లో ప్రాక్టీస్ చేసి వివిధ స్థాయిల్లో అత్యంత ప్రతిభ చూపడంతోపాటు జాతీయస్థాయిలో కూడా అద్వితీయ ప్రతిభ కనబరిచి పతకాన్ని స్వంతం చేసుకోవడం పట్ల ఆ చిన్నారి తాతయ్య జయేంద్రప్రసాద్‌రెడ్డి, తల్లిదండ్రులు పావని-కృష్ణారెడ్డిలు ఎంతగానో సంబరపడగా పలువురు బంధుమిత్రులు, ఉపాధ్యాయులు, వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు ఆ విద్యార్థిని ప్రతిభను కొనియాడారు. భవిష్యత్తులో ధృతి మరింతప్రతిభ చూపి అంతర్జాతీయస్థాయి పతకాలను కూడా స్వంతం చేసుకోవాలని వారంతా ఆకాంక్షించారు.

# ఆత్మకూరుకు డిగ్రీకాలేజి మంజూరు అటకెక్కిందా



## -నివేదికలు బుట్టదాఖలా

**ఆత్మకూరు,మేజర్‌న్యూస్:** ఆత్మకూరుకు ఒక ప్రభుత్వ డిగ్రీకాలేజి మంజూరుచేయాలని పలువురు అధ్యాపకులు, విద్యావేత్తలు, వివిధ ప్రజాసంఘాల నాయకులు, తదితరులు కోరడం, ఆమేరకు అభిప్రాయసేకరణ జరగడం, ఇదిగో అదిగో మంజూరు అంటూ ప్రచారం సాగినా ఇప్పటివరకు అతీగతీ లేనందున ఈఅంశం అటకెక్కిందా అనే సందేహం పలువురులో వ్యక్తమవుతోంది. ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ఒక ప్రభుత్వ డిగ్రీకాలేజి ఏర్పాటుచేయాలన్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి యోచనమేరకు గతంలో దివంగత రాష్ట్ర మంత్రి మేకపాటి గౌతంరెడ్డి వద్ద స్థానిక మున్సిపల్ వైస్‌చైర్మెన్, అభిరామ్ హాస్పిటల్ ఎం.డి.డాక్టర్ కె.వి.వ్రావణ్‌కుమార్‌రెడ్డి ప్రతిపాదించగా ఆమేరకు గౌతంరెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళారు. ఈవిషయమై ఏడాది క్రితం ఆత్మకూరులో అభిప్రాయసేకరణకు నెల్లూరు డికెడబ్ల్యుకాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ జి.గిరి బృందం పర్యటించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద పలువురు ప్రముఖులనుండి వారు అభిప్రాయసేకరణ గావించారు. స్థానిక డాక్టర్ ఎస్‌ఆర్‌జె డిగ్రీకాలేజి ప్రిన్సిపాల్ సిరిమామిళ్ళ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మెన్ డాక్టర్ కె.వి.శ్రావణ్‌కుమార్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు కె.వి.శేషారెడ్డి, నందా ఓబులేశు(ఏఐఎం న్యాయసలహాదారు, నియోజకవర్గ బిఎస్‌పి ఇన్‌చార్జ్), పీపుల్స్‌ఫోరమ్ అధ్యక్షుడు నోటి వెంకటేశ్వర్లురెడ్డి, సీనియర్ జర్నలిస్ట్, ఎల్‌ఆర్‌పల్లి జెడ్పిహైస్కూల్ ఎగ్జిక్యూటివ్ చైర్మెన్ సోమా వెంకటసుబ్బయ్య, యుటిఎఫ్, జనవిజ్ఞానవేదిన నాయకుడు లక్కు కృష్ణప్రసాద్‌రెడ్డి, ఎస్‌ఆర్‌జె కాలేజి లెక్చరర్ టి.శ్రీనివాసులురెడ్డి తదితరులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఆత్మకూరు డివిజన్ మెట్టప్రాంతమని, ఇక్కడ పేదల అభ్యాసానికి ప్రభుత్వం డిగ్రీకాలేజి ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, ప్రభుత్వకాలేజి అయితు విద్యార్థులకు భరోసా ఉంటుందన్నారు. ఇక్కడ డిగ్రీకాలేజి ఏర్పాటుకు అనువైన స్థలాలు ఉన్నాయని, ప్రజాసంఘాల సహకారం ఉంటుందని, డివిజన్‌లో 22జూనియర్ కాలేజిలుండగా అందులో నాలుగుమాత్రమే ప్రభుత్వానివని, 10 డిగ్రీకాలేజిలుండగా ప్రభుత్వ కాలేజిలు లేవని వారు పేర్కొన్నారు. పేద,మధ్యతరగతి విద్యార్థులు డిగ్రీ అభ్యశించేందుకు ప్రభుత్వ కాలేజి ఆవశ్యకమని, అయితే నేటి ఆధునిక పరిస్థితులకనుగుణంగా వృత్తివిద్యాకోర్సులు, కంప్యూటర్ కోర్సులు, అన్నీ మౌళికవసతులు, అనుబంధ హాస్టల్, అన్నీ సౌకర్యాలు, సంపూర్ణంగా అధ్యాపకులు, సిబ్బంది ఉండేలా చేస్తే ఎంతో ప్రయోజనకరమని వారు పేర్కొన్నారు. మొత్తంమీద అందరూ ముక్తకంఠంతో ఆత్మకూరులో ప్రభుత్వ డిగ్రీకాలేజి మంజూరుచేయాలంటూ కోరారు. ఈసందర్భంగా అభిప్రాయసేకరణ గావించిన డాక్టర్ గిరి మాట్లాడుతూ అందరూ ప్రభుత్వ డిగ్రీకాలేజి ఏర్పాటును స్వాగతిస్తున్నారని, ఇదే నివేదికను తాను ప్రభుత్వానికి అందజేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో డికెడబ్ల్యుకాలేజి లెక్చరర్ నారాయణరెడ్డి, ఏవో సుధాకర్, పలువురు వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. కాగా 2నెలల క్రితం ఆత్మకూరుకు ప్రభుత్వ డిగ్రీకాలేజి మంజూరుకానుందన్న ప్రచారం ముమ్మరంగా సాగింది. తీరా చూస్తే ఇప్పటివరకు ఎలాంటి ఉత్తర్వులు అందకపోవడంతో ఈ ప్రతిపాదన అటకెక్కినట్లేనా అని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. మరి ప్రభుత్వం స్పందిస్తుందేమో చూడాల్సి ఉంది.

## శ్రీ సాయి దర్బార్ లో రక్తదాన శిబిరం.

**నెల్లూరు కల్చరల్ (మేజర్ న్యూస్):**నెల్లూరు నగరంలోని శ్రీ సాయి దర్బార్ అద్దాల మందిరంలో ఆదివారం నాడు రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఈ రక్తదాన శిబిరం శ్రీ సాయి దర్బార్ యువసేవదళ్ సభ్యుడు కనుమూరు సాయినాథ్ రెడ్డి జ్ఞాపకార్థం రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఈ రక్తదానం శిబిరం ఆదివారం ఉదయం తొమ్మిది గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరుగును. రక్తదానం ఇవ్వదలుచుకున్నవారు 9502849784 నెంబర్ ను సంప్రదించవలసిందిగా శ్రీ సాయి దర్బార్ భక్త బృందం తెలిపింది.

# ఆత్మకూరు నియోజకవర్గం

## పాఠశాల ప్రహరీ నిర్మాణంపై ఫిర్యాదు

**అనంతసాగరం (మేజర్ న్యూస్)** అనంతసాగరం మండలం పడమటి కమ్మంపాడు గ్రామంలోని మండల ప్రజా పరిషత్ మెయిన్ పాఠశాల నూతన ప్రహరీ గోడ నిర్మాణం పై పంచాయతీ సెక్రెటరీ కి కొందరు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. నాడు నేడు పనుల కింద పాఠశాల అభివృద్ధిలో భాగంగా ప్రహరీ గోడ నిర్మాణం ప్రారంభించారు. అయితే అది పాఠశాల కు సంబంధించిన స్థలం కాదని గ్రామానికి సంబంధించినదిగా పేర్కొంటూ సెక్రటరీ కె నరేంద్ర కుమార్ కు ఫిర్యాదు చేశారు. నేపథ్యంలో ప్రహరీ గోడ ను చేపడుతున్న స్థలం ఎవరిది అన్న విషయంలో ఓ స్పష్టత వచ్చేంతవరకు నిర్మాణం జరపరాదని పాఠశాల వద్ద నోటీసును అంటించారు.

## విద్యార్థిని ఆదుకోవాలని విజ్ఞప్తి



**అనంతసాగరం (మేజర్ న్యూస్)** బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో చదువును అర్ధాంతరంగా ఆపివేసిన విద్యార్థిని దాతలు ఆదుకోవాలని తల్లిదండ్రులు, గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. అనంతసాగరం మండలం సోమశిల గ్రామానికి చెందిన రాచూరి వెంకటయ్య, కృష్ణమ్మ కుమార్తె శ్రీవిద్య ప్రాణాంతక బ్రెయిన్ ట్యూమర్ వ్యాధికి గురైంది. సోమశిల ఉన్నత పాఠశాలలో శ్రీవిద్య ఎనిమిదవ తరగతి చదువుతోంది. వ్యాధి తీవ్రతరం కావడంతో శ్రీవిద్యను తల్లిదండ్రులు చెన్నైలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చేర్పించారు.నిరుపేదలు దళితులు అయిన తల్లిదండ్రులు ఇప్పటికే వైద్య చికిత్సల నిమిత్తం వేల రూపాయలు ఖర్చు చేశారు. ప్రాథమిక దశలో ఉన్న వ్యాధిని నయం చేయాలంటే లక్షల్లో ఖర్చు అవుతుంది అని డాక్టర్లు తెలిపారని అంతటి స్తోమత తమకు లేదని ఇప్పటికే తలకు మించి అప్పు చేసామని దాతలు దాతృత్వం చూపి ఆదుకోవాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. 9491341370 నెంబర్ కు ఫోన్ చేసి సహాయం అందించాలని కోరుతున్నారు.

## ప్రమాదవశాత్తు కాలువలో జారిపడి వ్యక్తి మృతి



**సంగం(మేజర్ న్యూస్):**సంగం లోని కనిగిరి రిజర్వాయర్ ప్రధాన కాలువ వద్ద కాళ్ళు కడుక్కుంటుండగా ప్రమాదవశాత్తు కాలువలో జారిపడి సంగం కి చెందిన ఎ.పెంచలయ్య అనే వ్యక్తి మృతి చెందాడు.స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న ఎస్సై నాగార్జున రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని స్థానికుల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు.వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

# ఉదయగిరి నియోజకవర్గం

## గిరిజన కాలనీలకు మౌలిక సదుపాయాలు కల్పించండి

### సామాజికవేత్త మాలకొండ రెడ్డి



**వింజమూరు మేజర్ న్యూస్** సమాజంలో వెనుకబడిన నిరుపేదలైన గిరిజన కాలనీలకు సామాజిక భవనాలు మరియు మౌలిక వసతులు కల్పించాలని జిల్లా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మాజీ కమిటీ సభ్యులు ఎం మాలకొండ రెడ్డి మేజర్ న్యూస్ తో ఫోన్లో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ కి విజ్ఞప్తి చేశారుగిరిజనులు అభివృద్ధికి దూరంగా తరతరాలు నుండి నిరుపేదలుగా జీవిస్తూ పేదరికం అనుభవిస్తున్న గిరిజన కాలనీలను జిల్లా అధికారులు ప్రజాప్రతినిధులు సందర్శించి వారి అభ్యున్నతికి కృషి చేయాలని కోరినారు.ముఖ్యంగా ప్రతి గిరిజన కాలనీకి ఎంపీ నిధుల నుండి సామాజిక భవనాలు నిర్మించాలని కోరినారు

## మనబడి నాడు నేడు పనుల పరిశీలన



**ఉదయగిరి మేజర్ న్యూస్.** పట్టణంలోని దళితవాడ ప్రాథమిక పాఠశాలను శనివారంఉదయగిరి మండల విద్యాశాఖ అధికారి 2 శ్రీ తోట శ్రీనివాసులు  పనులను పరిశీలిస్తూ నాడు నేడు పనుల ద్వారా పాఠశాలలోని టాయిలెట్స్, హ్యాండ్ వాష్ పాయింట్స్, టైల్స్ తో ఫ్లోరింగ్, రాంప్స్, మరి ముఖ్యంగా పాఠశాల ముఖద్వారమును సర్వాంగ సుందరముగా నిర్మింప చేసిన ఉదయగిరి దళితవాడ పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ షబ్బీర్ ని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు ఎస్టీ హుస్సేనీ (కలీం ) పాల్గొన్నారు.

## నేటి నుంచి పాండురంగ ఉత్సవాలు ప్రారంభం



**సీతారాంపురం మేజర్ న్యూస్**సీతారామపురం పంచాయతీ పరిధిలోని పాండ్రంగి గ్రామ సమీపంలో ఉన్న పాండురంగ దేవస్థానం బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి మొదలవుతాయని ఆలయ కమిటీ చైర్మన్ పర కోట వెంకట సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం కలస మహోత్సవం, 20 న హనుమంతుని సేవ, 21న ప్రత్యేక పూజ గరుడ వాహన పూజ,22న స్వామి వారికి కళ్యాణం,23 న ఊరేగింపు పారువేట కార్యక్రమం జరుగుతున్న తెలిపారు. ఐదు రోజులపాటు అంగరంగ వైభవంగా వితలేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు జరుగుతాయని తెలిపారు.ప్రతిరోజు సాంస్కృత కార్యక్రమాలు అన్నదాన కార్యక్రమాలు కాశి నాయన సత్రం ఆధ్వర్యంలో జరుగుతాయని తెలిపారు. జిల్లాలోని భక్తులంతా ఈ ఉత్సవాల్లో పాల్గొని స్వామివారి కృపకు బాధ్యులు కావాలని తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



## చెరుకూరి రసూల్ సర్పంచ్

**వింజమూరు మేజర్ న్యూస్**పంచాయతీలోని ప్రజల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు సర్పంచ్ చెరుకూరు రసూల్ తెలిపారు ఉపసర్పంచ్ రమణారెడ్డి తో కలిసి ప్రజల సహకారంతో పంచాయితీకి అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నట్లు ఆయన తెలిపారు

**సర్పంచిగా ప్రమాణం**

2021సంవత్సరం ఫిబ్రవరి నెలలో సర్పంచ్ గా ప్రమాణ స్వీకారం చేశారని నాటినుండి పంచాయతీ అభివృద్ధి పనులే లక్ష్యంగా పనిచేస్తున్నారని తెలిపారు పంచాయితీలో బుక్కాపురం గ్రామంలో సుమారు 15 లక్షల రూపాయలు సిమెంట్ రోడ్లు ఏర్పాటు 10 లక్షల రూపాయల వ్యయంతో గ్రావెల్ రోడ్లు 5 లక్షల రూపాయల వ్యయంతో పైపులైన్లు ఏర్పాటు మరియు మరమ్మత్తులు పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు అంగన్వాడి భవన నిర్మాణం కూడా చేపట్టినట్లు ఆయన తెలిపారు అదేవిధంగా తొగటపాలెం గ్రామంలో ఐదు లక్షల బియ్యంతో సిసి రోడ్లు ఏర్పాటు చేసి ఆ గ్రామస్తులకు త్రాగునీటి సమస్య లేకుండా పరిష్కరించారు గ్రామంలో విద్యుత్ దీపాల ఏర్పాటు చేసి అసౌకర్యం లేకుండా చూశారు అదేవిధంగా చంద్రపడియ గ్రామంలో గ్రావెల్ రోడ్లు ఏర్పాటు చేయడం వీధి దీపాల ఏర్పాటు తదితర కార్యక్రమాలను చేపట్టామని తెలిపారు అలాగే గ్రామస్తులకు అవసరమైన స్మశాన వాటికను ఏర్పాటు చేశారు అలాగే గ్రామానికి అవసరమైన వీధి దీపాల ఏర్పాటు త్రాగునీటి సమస్య లేకుండా చూడడం తదితర కార్యక్రమాలను చేపట్టామని తెలిపారు

**చేయాల్సిన కార్యక్రమాలు**

పంచాయతీ పరిధిలో ఉన్న బుక్కాపురం తొగటపాలెం చంద్రపర్దియా గ్రామాలలో మరికొన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంది సమయం ఇంకా రెండు సంవత్సరాల కాలం ఉంది గనుక రాబోవు కాలంలో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ప్రజలకు సంక్షేమం దిశగా కృషి చేస్తామని తెలిపారు పంచాయతీకి అన్ని విధాల అభివృద్ధి దిశగా ప్రజల సంక్షేమం జరిగే విధంగా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

# పేదల దాహం తీర్చిన వ్యక్తి సుందరయ్య.



**ఉదయగిరి మేజర్ న్యూస్.** కుల నిర్మూలన వ్యవస్థను రూపుమాపిన వ్యక్తి ఆనాటి త్రాగునీటి ప్రవేశం లేని వారి దాహతి తీర్చిన మహోన్నత వ్యక్తి పుచ్చలపల్లి సుందరయ్య అని సిపిఎం మండల కార్యదర్శి ఫర్దిన్ భాష పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ  ఆదివారం జరుగు పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి పార్టీ కార్యాలయంలో జరుగుతుందన్నారు. పేదల పాలిట మహోన్నత వ్యక్తి పుచ్చలపల్లి సుందరయ్య అన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజా సంఘాలు సిపిఎం అనుబంధ సంఘాలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రజల కోసం ప్రజల మీద ప్రేమను కోల్పోకుండా తన భార్య అంగీకారంతో సంతానం లేకుండా ప్రజలకు సేవలందించేందుకు సిద్ధపడిన వ్యక్తి అన్నారు. అంతేకాకుండా తన తమ్ముడైన రామచంద్రారెడ్డి ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు డాక్టర్ ను చేయించి నెల్లూరులోని రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాలను నేటికీ నడిపిస్తున్నారన్నారు. ఓ విప్లవీరుడుగా ఐదు సంవత్సరాల తెలంగాణ సాయుధ పోరాటంలో విజయాన్ని జయించి పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన మహానీయుడని కొనియాడారు. అలాంటి మహోన్నత వ్యక్తి వర్ధంతిని ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు పందిళ్ళ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు

# ఘాట్ రోడ్ మరమ్మత్తులు చేపట్టాలని ఆందోళన



**ఉదయగిరి మేజర్ న్యూస్**  ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురైన ఉదయగిరి బండగానిపల్లి ఘాట్ రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టాలని స్థానిక ఆర్ అండ్ బి కార్యాలయం ఎదుట శనివారం సిపిఎం ఆధ్వర్యంలో కొండకింద గ్రామాల ప్రజలు నినాదాలతో కూడిన ఆందోళన చేపట్టారు ఈ సందర్భంగా సిపిఎం నాయకులు కాకు వెంకటయ్య మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు ఘాట్రోడ్ కోతులు గురై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు 10 రోజులుగా ఇదే పరిస్థితి ఉన్న సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం దారుణం అన్నారు దశాబ్దాలుగా రోడ్డు నిర్మాణాన్ని పాలకులు అధికారులు గాలికొదిలేయడంతో సుమారు 12 గ్రామాల్లోని పదివేల మంది జనాభా తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు ఎన్నికల సమయంలో ఘాట్ రోడ్ నిర్మాణం అంటూ పాలకుల హడావిడి చేస్తారే తప్ప అనంతరం పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఘాట్ రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టి రాకపోకలు సజావుగా సాగేలా చూడడంతో పాటు అసంపూర్తి నిర్మాణాన్ని పరితగతిన పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు



## హజ్ యాత్రికులకు శుభాకాంక్షలు

### తెలిపిన అబ్దుల్ అజీజ్

**నెల్లూరు సిటీ (మేజర్ న్యూస్)**నెల్లూరు నగరంలోని మూలాపేటలో గల నూరుల్ హుదా అరబిక్ కాలేజ్ నందు దువా చేసి హజ్ యాత్రికులకు నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ శుభాకాంక్షలు తెలియచేశారు. హజ్ యాత్రకు వెళ్ళే ముస్లిం సోదరులంతా క్షేమంగా తమ ప్రయాణాన్ని పూర్తి చేసుకుని తిరిగి రావాలని ఆకాంక్షించారు. హజ్ యాత్రకు వెళ్ళేటప్పుడు, వచ్చేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

## కావలి నియోజకవర్గం

# కావ్యతో కావలి కనకపట్నం అవుతుంది.

### చేనికల రజిని ఉత్తర క్రియలకు హాజరైన కావ్య కృష్ణారెడ్డి.



కావలి మేజర్ న్యూస్: కావలి పాత ఊరికి చెందిన చెనికల సాయి బ్రహ్మ మాతృమూర్తి శనికల రజిని ఇటీవల మరణించారు. శనివారం వారి ఉత్తర క్రియలకు కావలి నియోజకవర్గం ఎన్డీఏ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి హాజరయ్యారు. మొదటి మొదటిగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



### కావ్య క్రిష్ణారెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన కాపులు.

### కాపుల అభ్యున్నతికి కృషి చేస్తాను-

### ఎన్డీఏ అసెంబ్లీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి.

కావలి మేజర్ న్యూస్: కావలి పట్టణంలో కావలి కనకపట్నం అనేది కావ్య క్రిష్ణారెడ్డితో సాధ్యం అవుతుందని కాపు సోదరులు తెలిపారు. శనివారం కాపు నేతలు ఎన్డీఏ కూటమి కావలి అసెంబ్లీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డిని ముసునూరు లోని టీడీపీ కార్యాలయంలో కలసి శాలువాలతో సత్కరించి, బొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కాపు నేతలు మాట్లాడుతూ, కావలి నియోజకవర్గంలో కావ్య క్రిష్ణారెడ్డి భారీ మెజారిటీ సాధించడం ఖాయమని తెలిపారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కావలి లో కాపులపై దాడులు చేయడం, కేసులు పెట్టడం, మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తించడమే కాక, మహిళల పైన కూడా కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. చిన్న సమస్యను పరిష్కరించలేని ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి కాపు నేత సూరిశెట్టి సురేష్ చావుకు కారణమయ్యాడని ఆరోపించారు. రాజకీయంగా, అలాగే పదవులలో కాపులకు ప్రతాప్ రెడ్డి ఎలాంటి ప్రాధాన్యత కల్పించలేదన్నారు. ఎన్నో అవమానాలను, దాడులను, దౌర్జన్యాలను ఎదుర్కొన్న కాపులంతా ఏకమై తెలుగుదేశం పార్టీని ఈసారి ఆశీర్వదించడం జరిగిందన్నారు. కావ్య క్రిష్ణారెడ్డి ఎమ్మెల్యే అయితే పడకేసిన అభివృద్ధి ఇకపై స్పీడ్ అందుకోనున్నది.

అనంతరం కావ్య క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ, నన్ను గెలిపించడానికి కాపులు విశేషంగా కృషి చేశారని అన్నారు. కాపుల అభ్యున్నతికి కృషి చేస్తానని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కాపు భవనాన్ని నిర్మిస్తానని, కాపు సంక్షేమ నిధికి 25 లక్షలు అందజేస్తానని తెలిపారు. కావలి లో కావ్య ఉన్నంత వరకు కాపులకు బెంగ అవసరం లేదన్నారు. కక్షలు, కార్పణ్యాల కోసం రాజకీయాలోకి రాలేదని, సేవ చేయడానికి వచ్చానని తెలిపారు. కావలి లో పారిశ్రామికంగా అభివృద్ధి చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానని తెలిపారు. కావలి ని కాపాడుకోవడం కోసం, నా గెలుపు కోసం కృషి చేసిన తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలకు, అభిమానులు అందరికీ ధన్యవాదములు తెలిపారు.

## మృతి చెందిన ఉపాధ్యాయ కుటుంబానికి సంఘీభావ విరాళా చెక్కు అందించిన యుటిఎఫ్.

కావలి మేజర్ న్యూస్: కావలిరూరల్ మండలం మన్నా దిన్నె గ్రామంలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయినిగా పనిచేయుచున్న చాట్ల వనజ కుమారి మే 8వ తేదీన అనారోగ్యంతో మృతి చెందారు వారి కుటుంబ సభ్యులకు శనివారం ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటి ఎఫ్ ) కావలి అధ్యక్షులు షేక్ ముజీర్ అహ్మద్ ఆధ్వర్యంలో కుటుంబ సంక్షేమ సంఘీబావ విరాళ చెక్కు ఒక లక్ష 25 వేల రూపాయలను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, పాఠశాలలో మంచి గౌరవ ప్రతిష్టలు కలిగిన ఉపాధ్యాయునిగా పనిచేస్తూ అందరి చేత మనలను పొందిన వ్యక్తి అకాలంగా మరణించడం తమను ఎంతో కలచివేసిందని, వారి కుటుంబ సభ్యులకు తన ఫెడరేషన్ ద్వారా ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ వర్గ సభ్యులు బి. శ్రీదేవి మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## పన్నెండేళ్ళుగా దిష్టిబొమ్మగా వెక్కిరిస్తున్న అతిథిగృహం

### -నిర్మాణాల్లో ఆలస్యానికి పెట్టిందిపేరు ఆత్మకూరు

ఆత్మకూరు,మేజర్‌న్యూస్: ఆత్మకూరులో అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా ఏదేని భవనాల నిర్మాణాలు ప్రారంభిస్తే వాటిని పూర్తిచేయడంలో తీవ్ర జాప్యం, నిర్మించిన వాటిని సక్రమంగా వినియోగించకపోవడం పరిపాటిగా మారింది.



అందుకు నిదర్శనంగా నిలువెత్తు సాక్ష్యంగా ఆత్మకూరుపట్టణంలోని సోమశిల మార్గంలో చెరువుకట్ట వద్ద ఆర్‌అండ్‌బి శాఖకు చెందిన అతిథిగృహం నిర్మాణం ఒకటికాదు,రెండుకాదు 12సంవత్సరాలుగా దిష్టిబొమ్మలా దర్శనమిస్తోంది. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆర్థికశాఖామంత్రి ఆనం రామనారాయరెడ్డి ఆత్మకూరులో ఒక అతిథిగృహం అవసరమని నిధులు మంజూరు చేసి 12సంవత్సరాలు అయినా ఇంకా పూర్తికాకపోవడం గమనార్హం, ఆత్మకూరులో ఆర్డీవో,తహాశిల్దారు,మున్సిపల్ తదితర కార్యాలయాల భవనాలు 2012లోనే మంజూరై 2014లో పనులు ప్రారంభించినా ఇంకా నేటికీ పూర్తికాలేదు. అయితే ఈభవనాల ప్రారంభోత్సవాలు మాత్రం జరిగిపోయాయి. మున్సిపల్ కార్యాలయ భవనంమాత్రం పూర్తిచేసుకొని అక్కడికి కార్యాలయాన్ని తరలించి కొనసాగిస్తుండగా మిగతా కార్యాలయాల భవనాలు నిర్మాణంలోనే ఉన్నాయి.అదేకోవలో ఉన్న అతిథిగృహాన్ని గురించి అధికారాలు, పాలకులు పూర్తిచేయించి వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సర్వత్రా కోరుతున్నారు.పాయతీరాజ్ అతిథిగృహం మండలపరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఉందని, ఆర్‌అండ్‌బి అతిథిగృహం నెల్లూరుపాళెంలో ఉందని, అందువలన ఒక అతిథిగృహం అవసరమని 2011లో అప్పటి రాష్ట్ర ఆర్థికశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి భావించారు. వెంటనే 50లక్షల రూపాయలు మంజూరు చేయించారు. 2012లో టెండరు ప్రక్రియ పూర్తిచేసి 2013లో పనులు ప్రారంభించారు. శ్లాబ్‌లెవల్‌కు నిధులు పూర్తయ్యాయంటూ పనులు నిలిచిపోయాయి. ఏళ్ళు గడుస్తుండగా ప్రభుత్వం 30లక్షల రూపాయలు మంజూరు చేశారు. దాంతో మళ్ళీ కొంతమేరకు పనులు చేసి వదిలేశారు. గతంలో వేసిన విద్యుత్ మెటీరియల్, షింక్‌లు తదితరాలను ఎవరో గుర్తుతెలియని వారు తస్కరించుకెళ్ళారు. రెండేళ్ళ క్రితం ఈ భవనానికి రంగులు మాత్రం వేశారు. ఇక పెయింటింగ్, విద్యుత్, ఫర్నిచర్, తదితర పనులకు మళ్ళీ 25లక్షల రూపాయలకు ప్రభుత్వంకు ప్రతిపాదనలు పంపారు. ఆనిధులు మంజూరైతే ఇప్పటికైనా పనులు వేగవంతం చేస్తే మరో ఏడాదిలోపైనా పూర్తవుతుందని భావిస్తున్నారు. మరి ఎప్పటికి వినియోగంలోకి వస్తుందో చూడాల్సి ఉంది.

## పధకాలెన్ని అమలుచేస్తున్నా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల పెరుగుదల సున్నా

### -16 పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకం

### -సగం పాఠశాలలు ఏకోపాధ్యాయులే

### -రానున్న విద్యాసంవత్సరంలో మారేనా

ఆత్మకూరు,మేజర్‌న్యూస్: ప్రాథమిక విద్యను వృద్ధిచేయాలని, విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, బడిఈడు చిన్నారులందరినీ



ప్రభుత్వ పాఠశాలలకు రప్పించాలని అనాదిగా ప్రభుత్వాలు ఎన్నోరకాల యత్నాలు, ప్రయోగాలు చేస్తున్నా, నేటి ప్రభుత్వం అనేక మార్పులు, సంస్కరణలు తెచ్చినా ఫలితం మాత్రం ఆశాజనకంగా కానరావడం లేదు. గత విద్యాసంవత్సరంలో ఆత్మకూరు మండలంలో పరిశీలిస్తే ఏఏటికాఏడు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతూనే ఉండగా కొన్ని పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతున్నట్లుగా కన్పించింది. తాజా తరగతుల విలీన ప్రక్రియకూడా కొన్నిపాఠశాలల ఉనికికే ప్రమాదం ఏర్పడేలా ఉంది. అందుకు చక్కటి ఉదాహరణగా ఆత్మకూరు పట్టణంలోని ఉర్ధుప్రాథమిక పాఠశాల నిలువెత్తు సాక్ష్యంగా ఉంది. ఆస్కూల్లో తరగతుల విలీనానంతరం ఒక్క విద్యార్థిని, ఒక్క ఉపాధ్యాయుడుతో ఆపాఠశాల కొనసాగుతోంది. అయితే తక్కువమంది విద్యార్థులున్న పాఠశాలల్లో కూడా లక్షలాదిరూపాయలతో నాడునేడు కార్యక్రమంద్వారా లక్షలాదిరూపాయల వ్యయంతో భవనాల నిర్మాణాలు, మరమ్మత్తులు తదితర పనులు మాత్రం జరుగుతుండడం గమనార్హం. రానున్న విద్యాసంవత్సరంలో ఆ పాఠశాల కొనసాగే పరిస్థితి ఏమాత్రం ఉండబోదన్నది ఎవరు ఔనన్నాకాదన్నా అక్షరసత్యం. 10మందిలోపు విద్యార్థులున్న పాఠశాలలను మూసివేయాలనే యోచనలో ప్రభుత్వం ఉందని ఈమేరకు రెండురోజుల క్రితం వివరాలను ప్రభుత్వం సేకరిస్తుందని, ఆయా పాఠశాలలను కూడా సమీపపాఠశాల్లో విలీనం చేసి ఇక్కడ మూసివేస్తారా అన్న ప్రచారం సాగుతోంది. ఈపరిస్థితి చూస్తుంటే ఆత్మకూరు మండలంలో 10మందిలోపు విద్యార్థులున్న పాఠశాలలు 8కాగా 15లోపు మరో 8ఉన్నాయి. ఈ 16పాఠశాలల కొనసాగింపు ప్రశ్నార్థకమేనని భావిస్తున్నారు. అదీగాక ఆత్మకూరు మండలంలో దాదాపు 50 ప్రాథమిక పాఠశాలలుండా దాదాపు 70శాతం పాఠశాలలు ఏకోపాధ్యాయులతోనే కొనసాగుతున్నాయి. ఏ పాఠశాలైనా ఏకోపాధ్యాయ పాఠశాలగా కొనసాగరాదని గతంలో విద్యాచట్టాలు స్పష్టం చేయగా 3,4,5తరగతులను సమీపపాఠశాల్లో విలీనం చేయడం, కొన్నిచోట్ల ఉపాధ్యాయ పోస్టులను భర్తీచేయకపోవడం ఒక ఉపాధ్యాయిని మృతిచెందడం తదితర కారణాలతో ఏకోపాధ్యాయపాఠశాలలు అధికమయ్యాయి. గతప్రభుత్వంలోకానీ, నేటి ప్రభుత్వంలో కానీ అనేక విద్యాచట్టాలు తెచ్చారు. పాఠశాల విద్యాకమిటీలు, ప్రతిభగల విద్యార్థుల తల్లిదండ్రులతో కమిటీలు, తాజాగా స్కూల్‌పేరెంట్స్‌కమిటీలు , నూతన విద్యాచట్టాలు అంటూ అనేకం అమలుచేశారు. పోదాంబడికి, మళ్ళీబడికి, బడిబాటలాంటి ఎన్నో ప్రయోగాలు చేశారు. పాఠశాలలకనుబంధంగా వసతిగృహాలను నిర్వహిస్తున్నారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫారం దుస్తులు, మాధ్యాహ్నభోజనం తదితరాలను ఉచితంగా సమకూరుస్తున్నారు. అమ్మఒడి, విద్యాదీవెన, విద్యాకానుక, నాడునేడు తదితర కార్యక్రమాలెన్నో అమలుచేస్తున్నారు. బడిబయట 14సంవత్సరాలలోపు వారు తప్పకుండా బడిలోనే ఉండేలా చట్టాలు చేశారు. తీరా చూస్తుంటే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. బడిబయట కొందరు బడిఈడు పిల్లలు కన్పిస్తున్నారు. ఆత్మకూరు మండలంలో ప్రాథమి, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ప్రభుత్వంకు చెందినవి 76కాగా మండలంలో 1నుండి10తరగతులకు చెందిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 5503మందికాగా 2022-23విద్యాసంవత్సరంలో పరిశీలిస్తే 5126మందిగా ఉన్నారు. గతసంవత్సరం అడ్మిషపన్లు బాలురు2523కాగా ఈదపా 2267గా ఉంది. బాలికలు గత ఏడాది 2980కాగా ఈదపా 2859గా ఉంది. ఈవిద్యాసంవత్సరంలో కేవంలం ఒక్క విద్యార్థితో ఒకపాఠశాల, ఇద్దరు విద్యార్థులతో ఒక పాఠశాల కొనసాగుతుండడం గమనార్హం. 10మందిలోపు విద్యార్థులున్న పాఠశాలలు పరిశీలిస్తే ఆరవేడుజంగాలపల్లి(2), ఆత్మకూరు ఎల్‌ఆర్‌పల్లి ఉర్ధు(1), సాతానుపల్లి(7), రావులకొల్లు(8), అప్పారావుపాళెం ఈస్ట్‌హరిజనవాడ(6), అల్లీపురం(7), పేరారెడ్డిపల్లి ఎస్‌టి(7), వాసిలి ఎస్‌సి(4), 25మంది విద్యార్థులలోపు పాఠశాలలు పరిశీలిస్తే బొటికర్లపాడు(21), పడకండ్ల(21), కరటంపాడుమెయిన్(13), కరటంపాడు ఎస్‌సి(22), నబ్బీనగరం(14), గొల్లపల్లి(14), మహిమలూరు ఉర్ధు(21), చెర్లోయడవల్లి(11), అశ్వనీపురం(17), పాతజంగాలపల్లి(17), మురుగుళ్ళ ఎస్‌సి(11), మురుగుళ్ళ మెయిన్(11), అప్పారావుపాళెం మెయిన్(23), అప్పారావుపాళెం ఎస్‌టి(11), నల్లపురెడ్డిపల్లి(21), నరసాపురం(19), అనంతరాయునిపేని(11), వాసిలిన్యూనార్త్ ఎస్‌సి(21) విద్యార్థులతో కొనసాగుతున్నాయి. తరగతుల విలీనం అని పలువురు చెబుతున్నారు. అయితే అన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య చూసినా గత ఏడాదికన్నా ఈదపా 377మంది విద్యార్థులు తగ్గారు. 76ప్రభుత్వ పాఠశాలల్లో 5126మంది విద్యార్థులుండగా మండలంలోని 22 ప్రవేటు పాఠశాలల్లో చూస్తే 3583మంది విద్యార్థులున్నారు. ఇవన్నీ ప్రభుత్వ లెక్కలేకాగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయపోస్టుల నిష్పత్తికోసం ఒకటిఅరా విద్యార్థుల సంఖ్య కాస్తా ఎక్కువగానే చూపి ఉంటారని పలువురి వ్యాఖ్యగా విన్పిస్తోంది. మరి ఎన్ని సంస్కరణలు, ఎన్నిమార్పులు చేపట్టినా, ఎన్నెన్నో పథకాలు ప్రవేశపెట్టినా, హాస్టల్స్‌లో, పాఠశాలల్లో భోజనం మెనూ మార్చినా, షూలు, టైలు, ఇతర విద్యాసామగ్రిని ఉచితంగా సమకూరుస్తున్నా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎందుకు పెరగడంలేదు, లేక నాణ్యమైన విద్య లభించడంలేదా అనేది సర్వత్రా చర్చనీయంశంగా ఉంది. మరి ఈపరిస్థితిని ప్రభుత్వం ఎలాభావిస్తుందో, ఎలా పరిగణిస్తుందో, రానున్న విద్యాసంవత్సరంలో ఇంకేదైనా కొంగ్రొత్త ప్రయత్నాలు, ప్రయోగాలు చేస్తుందేమో చూడాల్సి ఉంది.

# నెరవేరని రిజర్వేషన్ ఆశలు

## సర్వేపల్లి నియోజకవర్గం

### యువకుడి ప్రాణాలు కాపాడిన మెరైన్ పోలీసులు



**తోటపల్లి గూడూరు మేజర్ న్యూస్ :** తోటపల్లి గూడూరు మండల పరిధిలోని కొత్త కోడూరు బీచ్ లో జానీ అనే 22ఏళ్ల యువకుడు గల్లంతయ్యాడు. మెరైన్ పోలీసులు అప్రమత్తమై యువకుడి ప్రాణాలు కాపాడారు. నెల్లూరు డైకాస్ రోడ్డుకు చెందిన జానీ ( తండ్రి పేరు నారాయణ) అనే యువకుడు తన స్నేహితులతో కలిసి శనివారం ఉదయం కొత్త కోడూరు బీచ్ లో విహరిస్తుండగా ఒక్కసారిగా అలల తాకిడికి సముద్రంలోకి కొట్టుకొని పోయాడు. వెంటనే అప్రమత్తమైన మెరైన్ పోలీసులు శేషగిరి, సంజయ్ యువకుడుని కాపాడి ప్రధమ చికిత్స చేసి ఆసుపత్రికి తరలించారు. యువకుడ్ని కాపాడిన పోలీసులను సందర్శకులు హర్షద్వానాలతో అభినందించారు

### ఆత్మకూరులో టౌన్‌హాల్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

**-నేతలు చొరవచూపాలి**

**ఆత్మకూరు,మేజర్‌న్యూస్:** ఆత్మకూరు పట్టణంలో ఒక పురమందిరం ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. ఆత్మకూరు పట్టణం గ్రామపంచాయతీ స్థాయి నుండి 2012లో మున్సిపాలిటీగా మారి పలు విదాలుగా పట్టణం అభివృద్ధి చెందింది. పట్టణంలో ఏదేని చిన్నపాటి కార్యక్రమం నిర్వహించుకోవాలన్నా తీవ్ర అసౌకర్యంగా ఉంటుంది. ప్రభుత్వపరంగా కూడా ఏదేని అధ్యాత్మిక, ఇతర కార్యక్రమాలు, శిక్షణా తరగతులు నిర్వహించాలంటే ఏదో ఒక కళ్యాణమండపం, పట్టణంవెలుపలి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజి, ఆంధ్రా ఇంజనీరింగ్ కాలేజిల్లో ఏర్పాటు చేసుకోవాల్సి ఉంది. ఆత్మకూరు నియోజకవర్గ కేంద్రంగా ఉండడంతోపాటు రెవిన్యూ డివిజన్‌గా, మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయింది. ప్రభుత్వ జిల్లా వైద్యశాల కూడా ఆత్మకూరులోనే ఉంది. అనేక భవనాలు, విశాలమైన రోడ్లు, డివైడర్లు, సెంట్రల్‌లైటింగ్ తదితరాలు ఏర్పాటు చేశారు. పట్టణం బాగా విస్తరించింది. కార్యక్రమాలు కూడా పెరిగిపోతున్నాయి. ఏదేని సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించుకోవాలన్నా అవకాశం లేకుండా ఉంది. చిన్నపాటి కార్యక్రమం కానీ, సభలు, సమావేశాలు జరుపుకోవాలంటే అవకాశం లేనందున తప్పకుండా ఒక పురమందిరం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గతేడాదివరకు మున్సిపల్ కార్యాలయం స్థానిక నేతాజిక్లబ్‌గా పిలువబడే భవనంలో నిర్వహిస్తుండగా మున్సిపల్ నూతన భవనాలు నిర్మాణం పూర్తికావడంతో అక్కడకు కార్యాలయం తరలించారు. అయితే నేతాజీక్లబ్‌నే నిర్వాహకులు పురమందరంగా భావిస్తున్నారు. కాగా అక్కడ కనీససౌకర్యాలు లేనందున అందరూ వినియోగించుకోలేకున్నారు. ఆత్మకూరులో అవసరాన్ని గుర్తించి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఒకపురమందిరాన్ని ఏర్పాటు చేయాలని సర్వత్రా కోరుతున్నారు. లేదా నేతాజీక్లబ్‌నైనా కనీససౌకర్యాలతో పురమందిరంగా మార్పుచేయాలని, వెంటనే ఈవిషయంపట్ల పాలకులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.








**-అమలుకు నోచుకోని హామీలు**

**—అలసిపోయిన ఉద్యమాలు**

**—ఆవేదనతో బెస్త, వాల్మీకిబోయ, కాపులు**

**—కొత్తప్రభుత్వంలో ఫలితమిచ్చేనా**

**ఆత్మకూరు,మేజర్‌న్యూస్:** అనాదిగా తమను రిజర్వేషన్ జాబితాలో చేర్చాలంటూ రాష్ట్రంలో కాపులు, బెస్త,వాల్మీకిబోయ సంఘీయులు ఎందరెందరో పాలకులకు, అధికారులకు విన్నపాలుచేసినా, ఆందోళనాకార్యక్రమాలు నిర్వహించినా, పలువురు నేతలు హామీలిచ్చినా వారి ఆశలు నెరవేరలేదు. ప్రభుత్వాలు మారుతున్నా వారి రిజర్వేషన్ ఆకాంక్షలు నెరవేరలేదు. హామీలిచ్చిన నేతలు అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడంలేదన్న ఆవేదన, ఆగ్రహం వారిలో కన్పిస్తోంది. దశాబ్దాల తరబడి మత్స్యకారులైన బెస్త సంఘీయులను ఎస్టీల జాబితాలో చేర్చాలన్న కల నెరవేరలేదు. నేతలెందరో ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదు. ఇటీవల ఎన్నికల ప్రచారాల్లో ఏపార్టీ కూడా వారి గురించి మాట్లాడడంకానీ, హామీ ఇవ్వడం కానీ జరగలేదు. రానున్న నూతన ప్రభుత్వంలోనైనా వారి ఆశలు, ఆకాంక్షలు నెరవేరేనా అని వారు ఎదురు చూస్తున్నరు. మండల,జిల్లా,రాష్ట్ర స్థాయిలో ఎన్నో ఉద్యమాలు చేసిన బెస్త సంఘీయులు 2009లో డిల్లోలో కూడా ధర్నా చేశారు. అప్పట్లో యుపిఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ వారికి హామీ ఇచ్చినా అమలుకాకపోగా 2014నుండి అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వమైనా పట్టించుకోవాలని, మత్స్యకారులైన బెస్తసంఘీయులను ఎస్టీల జాబితాలో చేర్చాలని వారంతో కోరుతూనే ఉన్నా తమ కోరిక నెరవేరడంలేదని వారంతా ఆవేదనతో ఉన్నారు. 2009లో వివిద జిల్లాలకు చెందిన సంఘ నాయకులు200మంది డిల్లీకి వెళ్ళగా నెల్లూరు జిల్లానుండి ఆసంఘ జిల్లా అధ్యక్షుడు పుట్టుబోయిన సుబ్బరాయుడు(ఆత్మకూరు మండలం మహిమలూరు), జిల్లా నాయకులు ఎం.వెంకటేశ్వర్లు,. మద్దినేని నారాయణ, సి.హెచ్.రాజశేఖర్‌లు కూడా వెళ్ళి పార్లమెంట్ భవన్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనాదిగా అన్ని రంగాల్లో ఆర్థిక అభివృద్ధికి నోచుకొనక నానా అవస్థలు పడుతున్నామని, కుల వృత్తితో జీవనం సాగించాలంటే తగిన అవకాశాలు లేవని, తమ కులాన్ని ఎస్టీల జాబితాలో చేర్చితో అన్నిరంగాల్లో సంక్షేమఫలాలు అందుకోగలమని, అభివృద్ధి చెందగలమని కోరారు. యుపిఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీని కలిశామని, ప్రణబ్‌ముఖర్జీ, చిదంబరం, మీరాకుమారి తదితర కేంద్రమంత్రులను కూడా కలవగా చర్యలు తీసుకుంటామంటూ హామీలిచ్చారని ఆసంఘ నాయకులు పేర్కొన్నారు. 1970 నుండి పి.వి.నరశింహరావు, జలగం వెంగళరావు తదితరలంతా ప్రతిపాదించినా తమ సమస్య పరిష్కారానికి నోచుకోలేదన్నారు..దేశంలో ఆరు రాష్ట్రాల్లో మినహా మిగతాచోట్ల బెస్తలు ఎస్టీలుగా ఉన్నారని, ఆంధ్రప్రదేశ్‌తో సహా మరో ఐదురాష్ట్రాల్లోనే బిసిలుగా ఉన్నామని వారు వివరించారు. పలువురు రాష్ట్రమంత్రులకు కూడా విన్నవించామని, పాదయాత్రలో నేటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి విన్నవించగా హామీ ఇచ్చారని, అయినా అమలుకునోచుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

**కాపుల రిజర్వేషన్‌ను మరిచిన పాలకులు**

రాష్ట్రంలో దాదాపు 25శాతం మంది జనాభాగా ఉన్నామని చెబుతున్న కాపులు నాలుగుదశాబ్దాలుగా తమను బిసిల జాబితాలో చేర్చాలన్న ఉద్యమాలు ఉవ్వెత్తున నిర్వహించగా అందరూ హామీలిచ్చారే తప్ప అమలుకు నోచుకొనకపోగా ఈ అంశం మరుగునపడిందని, మళ్ళీ ఉద్యమానికి సిద్ధం కావాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని కాపుసంఘ నాయకులు పలువురు చెబుతున్నారు. రాష్ట్రంలో ఎన్నికల్లో కీలకంగా మారుతున్న కాపులు ఎన్నికల అనంతరం కరివేపాకులాగా అవుతున్నారని వారభిప్రాయపడుతున్నారు. అనాదిగా ఎన్నో ఉద్యమాలు జరిగినా కాపుసంఘ నాయకుడు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం దాదాపు20లక్షల మందితో మహోద్యమం, దీక్ష నిర్వహించగా నాటి ప్రభుత్వం ఉద్యమాన్ని అణగదొక్కిందని, దీక్షను భగ్నం చేశారని, హింసాత్మకంగా వ్యవహరించారని, అక్రమకేసులు బనాయించారని వారు ఆవేదనతో చెబుతున్నారు. అయితే గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కేంద్రప్రభుత్వం నుండి ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రకటించిన ఇబిసిలకు 10శాతం రిజర్వేషన్‌లో 5శాతం కాపులకు కేటాయించేలా నిర్ణయించి ఈమేరకు చట్టబద్ధత కల్పించాలని కేంద్రానికి పంపారని, అనంతరం అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆ అంశాన్ని కనుమరుగుచేశారని వారు చెబుతున్నారు. గతంలో ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య కాపులకు బిసి రిజర్వేషన్ కల్పించగా మద్రాసురాష్ట్రం నుండి విడిపోయినప్పటినుండి కాపులపై కుట్రపన్నారని, రిజర్వేషన్ సౌకర్యం రద్దుచేశారని, ఎలాంటి కమీషన్‌లు కూడా లేకుండా రద్దు చేశారని, ఉద్యమించిన కాపులకు కాపుబ్రహ్మానందరెడ్డి, వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి, ఎన్‌టిరామారావు, నారా చంద్రబాబునాయుడు తదితరులు హామీలిచ్చినా అమలు చేయలేదని, జగన్మో హన్‌రెడ్డి అసలు పట్టించుకొనకుండా నిర్లక్ష్యంగా మాట్లాడారని వారంతా ఆవేదనతో చెబుతున్నారు. రాష్ట్రంలో 1910నుండి 1956వరకు, 1961నుండి 1966వరకు తెలగ,బలిజ,కాపులు బిసిల జాబితాలో ఉండేవారని, అనంతరం ఎలాంటి కమీషన్‌ల నివేదికలు లేకుండానే రద్దు చేశారని, అన్నిరంగాల్లో వెనుకబడిన కాపు,బలిజ,తెలగ,ఒంటరి సంఘీయులు బిసిల జాబితానుండి తొలగించినందున విద్య,ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారని, ఎన్ని ఉద్యమాలు నిర్వహించినా ఫలితం లేకపోయిందని, ఎవరూ కనికరించలేదని కాపులు తీవ్ర మనోవేదనతో ఉన్నారు. తమ రిజర్వేషన్లపై 1995లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును కూడా అమలు చేయనందున తాము తీవ్రంగా నష్టపోతున్నామని, తమ కాంక్ష నెరవేరడంలేదని, ఉద్యమాలు చేసి అలసిపోయామంటున్నారు.

**వాల్మీకిబోయల రిజర్వేషన్ కలలుకల్లలేనా**

ఎలాంటి కులవృత్తులు లేక, పేదరికంతో అలమటిస్తున్న రాష్ట్రంలోని వాల్మీకిబోయ కులస్థులను ఎస్టీల జాబితాలో చేర్చాలంటూ ఎన్నో ఉద్యమాలు చేసినా , ఎందరో నాయకులు హామీలిచ్చినా అమలుకునోచుకొనక తీవ్రంగా అవస్థలుపడుతున్నామని వాల్మీకిసంఘ జిల్లా అధ్యక్షుడు నల్లబోతుల వెంకటేశ్వర్లు తదితరులు తీవ్రావేదనతో చెబుతున్నారు. రాష్ట్రంలో దాదాపు 40లక్షలమంది తమ సామాజికవర్గానికి చెందినవారుండగా అత్యధికశాతం నిరుపేదలని చెబుతున్నాడు. తమ కులాన్ని ఎస్టీలజాబితాలో చేర్చాలంటూ విన్నపాలు చేసినా, ఆందోళనలు చేసినా ఫలించలేదని, దారిద్ర్యం అనుభవిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏజెన్సీ,మైదానంలుగా విభజించి త మ సామాజికవర్గీయులను ఏజెన్సీలో ఎస్టీలుగా, మైదానంలో బిసిలుగా పరిగణిస్తున్నారని ఆయన తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోడికి కర్నూలులో వినతిపత్రం అందజేయగా తమను ఎస్టీలజాబితాలో చేరుస్తామని హామీ ఇచ్చారని, గతంలో రాష్ట్ర మంత్రులు పొంగూరు నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కాలువశ్రీనివాసులు తదితరులకు, అనేకమంది ఉన్నతాధికారులకు వినతిపత్రాలిచ్చామని, గత ఎన్నికలకు ముందు పాదయాత్రలో జగన్మోహన్‌రెడ్డికి విన్నవించగా తాను అధికారంలోకి వచ్చిన తొలిఅసెంబ్లీ సమావేశంలోనే ప్రతిపాదించి కేంద్రానికి పంపుతానని హామీ ఇచ్చినా అమలుకు నోచుకోలేదని నల్లబోతుల ఆవేదనతో తెలిపారు. మొత్తంమీద రిజర్వేషన్ కోరుకుంటున్న కాపులు, బెస్తలు,బోయలు ఉద్యమాలు చేసి చేసి హామీలు వినివిని అలసిపోయారు. త్వరలో రాష్ట్రంలో అధికారంపొందేవారైనా వారి మొర ఆలకిస్తారా అని ఎదురు చూస్తున్నారు.

# వినియోగదారుల హక్కుల చట్టాలు ఇవే..!!

**నెల్లూరు (మేజర్ న్యూస్)** రాకేష్ ఇంటి సామాను కొనేందుకు కిరాణం దుకాణానికి వెళ్లాడు. మొత్తం సామాను గోనె సంచిలో కట్టించుకొని ఇంటికి తిరిగి వచ్చేశాడు. ఇంటికొచ్చిన తర్వాత సంచిలో నుంచి సరుకులు తీసి బయటపెట్టాడు. గులాబ్ జామున పెట్టెను తీసి దానిపైనున్న వివరాలను చదవసాగాడు. ఈక్రమంలో ఆ గులాబ్ జామున పెట్టె వాడకానికి సంబంధించిన ఎక్స్పరీ తేదీ ముగిసిందని గుర్తించాడు. సందేహం వచ్చి మిగితా సరుకులూ గబగబా పరిశీలించాడు. మరో రెండు సరుకులపైనా ఎక్స్పరీ తేదీ ముగిసిందని ఉండటాన్ని గుర్తించాడు. ఆ సరుకులను తీసుకెళ్లి సదరు దుకాణదారుడికి ఇచ్చి, కొత్త ప్యాకింగ్, వాడకానికి గడువు(ఎక్స్పరీ తేదీ) ఉన్నవాటిని తీసుకున్నారు.

ఇదొక్కటే కాదు.. తూకంలో మోసం జరిగినా.. ధరల్లో వ్యత్యాసం చోటుచేసుకున్నా.. నాణ్యతలో తేడా జరిగినా చట్టపరంగా ప్రశ్నించడంతో పాటు, జరిమానా సాధించుకునే హక్కు ప్రతీ వినియోగదారుడికి ఉంటుంది. ఈవిషయం తెలిసినా సాక్షాత్తూ ఉన్నత విద్యావంతులైన వినియోగదారుల్లోనూ నిర్లిప్తత రాజ్యమేలుతోంది. 'మనకు ఎందుకులే..?' అనే ఒకేఒక్క పదం కల్తీ, తూకం మోసాలకు తావిస్తోంది. వినియోగదారులను దగా చేస్తున్నవారు దర్జాగా కాలం గడిపేందుకు అవకాశాన్ని కల్పిస్తోంది. ఇప్పటికైనా వినియోగదారులు మేల్కొనాలి. వినియోగదారుల హక్కుల చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి.

## వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టాలివీ..!!

ఇండియన్ టెలిగ్రాఫ్ చట్టం(1865), పోస్టాఫీసు చట్టం(1898), ఇండియన సేల్స్ అండ్ గూడ్స్ చట్టం(1937), బీమా చట్టం(1938), డ్రగ్స్ అండ్ కాస్మోటిక్స్ చట్టం (1940), డ్రగ్ కంట్రోల్ చట్టం(ఔషధ నియంత్రణ చట్టం) (1950), ఇండియన స్టాండర్డ్ ఇనస్టిట్యూషన(సర్టిఫికేషన) చట్టం(1950), ఆహార కల్తీ నిరోధక చట్టం (ప్రివెన్షన ఆఫ్ ఫుడ్ అల్టరేషన చట్టం ) (1954), డ్రగ్స్, మ్యాజిక్ రెమిడీస(అభ్యంతరకర ప్రకటనలు) చట్టం(1954), నిత్యావసరాల చట్టం(1955), జీవిత బీమా చట్టం (1956), ట్రేడ్, మర్చండైజ్ మార్క్ చట్టం(1958), మోనోపలీస్, రిస్ట్రిక్టివ్ ట్రేడ్ ప్రాక్టీస్ చట్టం(1969), ప్రైజ్, చిట్స్, మనీ సర్క్యులేషన స్కీమ్స్ చట్టం(1970), తూనికలు, కొలతల ప్రమాణాల చట్టం(1977), ప్రివెన్షన ఆఫ్ బ్లాక్ మార్కెటింగ్, మెయింటెనెన్స ఆఫ్ సప్లయిస్ ఆఫ్ ఎసెన్షియల్ కమోడిటీస్ చట్టం(1980), వాయివు(కాలుష్య నియంత్రణ) చట్టం (1981), గృహోపకరణ విద్యుత పరికాలక్వాలిటీ కంట్రోల్ చట్టం(1951), చిట్ ఫండ్స్ చట్టం(1982), తూనికలు, కొలతల ప్రమాణాల ఎనఫోర్సుమెంట్ చట్టం (1985), బ్యూరో ఆఫ్ ఇండియన స్టాండర్ట్ చట్టం (1986), వినియోగదారుల రక్షణ చట్టం (1986), పరిసరాల పరిరక్షణ (ఎనఫోర్సుమెంట్ ప్రొటెక్షన) చట్టం (1986), ఎలక్ట్రికల్ అప్లయన్సెస్ (క్వాలిటీ కంట్రోల్) ఆర్డర్ (1986), ఎలక్ట్రిక్రల్ వైర్స్, కేబుల్స్ అప్లయన్సెస్, యాక్సెసరీస్ చట్టం (1993), కేబుల్ టెలివిజన నెట్‌వర్క్ రెగ్యులేషన చట్టం (1995), ఇనఫర్మేషన టెక్నాలజీ చట్టం (2000), ఇండియన ఎలక్ట్రిసిటీ చట్టం (2003). వినియోగదారులందరికి ఉపయోగపడే ఈ చట్టాల్లో ఎప్పటికప్పుడు సవరణలు జరుగుతున్నాయి. తనకు అన్యాయం జరిగినప్పుడు వినియోగదారుడు ఫిర్యాదు ద్వారా లేదా కోర్టులో కేసుద్వారా న్యాయం పొందొచ్చు.

## వినియోగదారులెవరు..?

వినియోగదారులంటే ఎవరు.. అనే సందేహం కలగవచ్చు. వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం-1986 ప్రకారం తమ అవసరార్థం వస్తువులు లేదా సేవలు కొనుగోలు చేసిన వారు వినియోగదారులు. అలాగే కొనుగోలుదారుల అనుమతితో ఆ వస్తువుల లేదా సేవలను వినియోగించుకునేవారు సైతం వినియోగదారులే. దీని ప్రకారం మనమందరం ఏదో ఒకరకంగా




వినియోగదారులమే.

## ఫిర్యాదు ఎవరు చేయాలి..?

వినియోగదారుడు, వినియోగదారుల స్వచ్ఛంద సంస్థ, కేంద్ర ప్రభుత్వం/రాష్ట్ర ప్రభుత్వం, అనేక మంది వినియోగదారుల పక్షాన ఒకరుగానీ లేదా కొందరు గానీ ఫిర్యాదు చేయవచ్చు.

## చట్టరీత్యా రక్షణ ఎప్పుడు పొందాలి..?

అమ్మకందారుడు అక్రమ వ్యాపారం చేస్తున్న సందర్భాలోనూ, నిర్భంద వ్యాపారాన్ని కొనసాగిస్తున్నపుడు, తాను కొనుగోలు చేసిన వస్తువులోగానీ, కొనుగోలు చేస్తున్న వస్తువులో గానీ లోపాలు గమనించినప్పుడు, తాను అద్దెకు తీసుకున్న లేదా ఖరీదు చేసిన సేవల విషయంలో లోపాలు గమనించిన సందర్భంలో, తాను కొనుగోలు చేస్తున్న వస్తువులకు నిర్ణయించిన ధరకంటే ఎక్కువ ధరను వ్యాపారి వసూలు చేసిన సందర్భంలోనూ, లేబుల్ మీద ప్రచరించిన ధరకంటే ఎక్కువ ధర వసూలు చేసినప్పుడు, ప్రాణాలకు హానీ చేసే, భద్రతలకు ముప్పు తెచ్చే వస్తువుల్ని వ్యాపారస్తుడు విక్రయించే సందర్భాల్లోనూ పొందవచ్చు.

## ఎంఆర్‌పీ చూసిన తర్వాతే చెల్లింపులు

కూల్‌డ్రింక్స్ 250 ఎంఎల్ బాటిల్‌పై ఎంఆర్‌పీ ధర రూ.10 ఉంటే.. దానిని రూ.20లకు విక్రయించినా నోరు మెదపకుండా తీసుకుని తాగుతున్నారే తప్ప ఎవరికీ ఫిర్యాదు చేయలేని పరిస్థితి. సినిమా థియేటర్‌కు వెళితే రూ.10కి వచ్చే తినుబండారాలు రూ.30లకు విక్రయించినా ఎవరూ ప్రశ్నించరు. ఇలా ప్రతీ చోట వినియోగదారుడు మోసపోతున్నా ఎవరికి చెప్పాలో తెలియక..

కొందరైతే మనకెందుకులే అంటూ రాజీపడుతూ మోసానికి గురవుతున్నారు. గుడ్డిగా ఏ వస్తువును కొనవద్దు. ముందుగా కొనదలిచిన వస్తువు గురించి పూర్తి సమాచారం సేకరించాలి. ఒకే తెగకు చెందిన రెండు ప్యాకేజీలలో దేనిలో నెట్‌కంటెంట్స్ ఎక్కువగా ఉన్నాయో చూసి కొనాలి. కాస్మోటిక్ ఉత్పత్తులపై తప్పనిసరిగా వస్తువు ధర, తయారీ తేదీ, ఎక్స్పైరీ తేదీ, తయారీదారుని చిరునామా, వస్తువు బరువు ముద్రించాలి. ఉత్పత్తులపై ముద్రించిన ఎంఆర్‌పీపై మరో స్టిక్కర్ అంటించి దాని ధర మార్చి అమ్మడం నేరం. మోసపూరిత ప్రకటనలపై జాగ్రత్త వహించాలి. వస్తువు నాణ్యతపై రాజీ పడవద్దు.

## ఇలా ఫిర్యాదు చేయండి..!!

ఏదైనా వస్తువు కొనుగోలు చేసినప్పుడు నాణ్యత లేదనో.. ధర ఎక్కువగా తీసుకున్నారనో.. ముగింపు తేదీ గడిచిందనో.. తూకంలో తేడా ఉందనో నిర్ధారణకు వచ్చినప్పుడు జిల్లా కేంద్రంలో ఉండే వినియోగదారుల ఫోరంలో నేరుగా ఫిర్యాదు చేయవచ్చు.ఫిర్యాదు చేసే విధానం చాలా సులభం. తెల్లకాగితంపై వివరాలు రాసి ఫిర్యాదు చేయవచ్చు.న్యాయవాది అవసరం కూడా లేదు.ఫిర్యాదుదారుడైనా లేదా అతని ఏజెంట్ ఫోరంలో నేరుగా ఫిర్యాదు ఇవ్వవచ్చు. లేదా పోస్టు ద్వారా కూడా పంపుకునే అవకాశం ఉంది.వినియోగదారుడి ఫిర్యాదుపై త్వరగానే చర్యలు తీసుకునే అవకాశం ఉంది. తూకంలో మోసాలపై స్థానికంగా ఉన్న తూనికలు, కొలతల శాఖ అధికారులకు కూడా ఫిర్యాదు చేయవచ్చు. వారు చర్యలు తీసుకోకపోతే వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించవచ్చు.ఫిర్యాదుపత్రంలో ఫిర్యాదుదారుని పూర్తి పేరు, చిరునామా తప్పనిసరిగా ఫిర్యాదులో పేర్కొనాలి.

అవతలి పార్టీపూర్తి పేరు, చిరునామా, ఫిర్యాదు చేయడానికి గల కారణాలు.. ఎప్పుడు ఏ విధంగా మోసం లేదా నష్టం జరిగిందో పేర్కొనాలి. దానికి సంబంధించిన డాక్యుమెంట్లు, రశీదు, ఇతర వివరాలు జత చేయాలి.మనం కొనే వస్తువు లేదా సేవల విలువ రూ.20లక్షల వరకు ఉంటే జిల్లా ఫోరంలో, రూ.20లక్షలకు మించి రూ.1కోటి వరకు ఉంటే రాష్ట్ర కమిషనలో ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది.కొనుగోలు చేసిన, నష్టం జరిగిన నాటి నుంచి రెండేళ్లలోపు ఫిర్యాదు చేయవచ్చు.

ఆలస్యానికి తగిన కారణాలు చూపితే రెండేళ్లు దాటిన తరువాత ఫిర్యాదు చేసేందుకు కూడా అవకాశం ఉంది.వస్తువు లేదా సేవ విలువ, కోరే నష్టపరిహారం లక్ష రూపాయల లోపు ఉంటే కోర్టు ఫీజు రూ.100 చెల్లించాల్సి ఉంటుంది. రూ.1 లక్ష నుంచి రూ.5లక్షల వరకు రూ.230లు వసూలు చేస్తారు. రూ.10లక్షల వరకు రూ.400లు, ఆపైన రూ.500ల కోర్టుకు చెల్లించాల్సి ఉంటుంది.

## 5 హక్కులు.. వినియోగ దారులకు 'పంచ'ప్రాణాలు

1. భద్రత హక్కు : వినియోగదారుడు కొనే వస్తువులు, పొందే సేవలు తక్షణ అవసరాలు తీర్చేవిగానే కాకుండా దీర్ఘకాలం మన్నికలా ఉండాలి. అవి వినియోగదారులు ఆస్తులకు నష్టం కలిగించకూడదు. ఈ భద్రత పొందడానికి వినియోగదారులు కొనే వస్తువుల నాణ్యతను నిర్ధారించుకోవాలి. వీలైనంతవరకు ఐఎసఐ, ఆగ్‌మార్క్, హాలోగ్రామ్ వంటి నాణ్యతా చిహ్నాలు గల వస్తువులు కొనుగోలు చేయాలి.

2. సమాచారం పొందే హక్కు : వినియోగదారులు కొనే వస్తువులు, పొందే సేవలు నాణ్యతా ప్రమాణాలు, ధరల గురించి సంపూర్ణ సమాచారం పొందవచ్చు.

3. వస్తువుల ఎంపిక హక్కు : అనేక రకాల వస్తువులను, సేవలను తగిన సరసమైన ధరలలో పొందడం వినియోగదారుల హక్కు

4. అభిప్రాయం వినిపించే హక్కు: వినియోగదారుల వేదికలపై తమఅభిప్రాయాలు వినిపించవచ్చు. ప్రభుత్వం, ఇతర సంస్థలు ఏర్పాటు చేసే పలు సంఘాలలో ప్రాతినిథ్యం పొందగల రాజకీయేతర, వాణిజ్యేతర వినియోగదారుల సంఘాలను ఏర్పరుచుకోవడం కూడా ప్రాథమిక హక్కు.

5. న్యాయపోరాటం: అన్యాయమైన వాణిజ్యవిధానాలు, మోసపూరిత పద్ధతుల నుంచి న్యాయబద్ధమైన రక్షణ పొందడం వినియోగదారుల హక్కు. వినియోగదారులకు హక్కులతోపాటు బాధ్యతలూ ఉన్నాయి.

వినియోగదారులు తమకు జరిగిన నష్టంపై వినియోగదారుల ఫోరానికి ఫిర్యాదు చేసేందుకు, సలహాలు పొందేందుకు ఫోన్ చేయాల్సిన నంబర్లు ఇవీ.. 1967, 18004250003

## బిల్లు తప్పనిసరిగా తీసుకోండి

కొనుగోలు చేసే సమయంలో సరైన రశీదును అడిగి తీసుకోవాలి. కొన్ని వస్తువుల విషయంలో గ్యారెంటీ, వారెంటీ కార్డులను షాపు యజమాని సంతకం, ముద్రతో సహా తీసుకోవాలి. ఇవి వినియోగదారుల ఫోరంలో సమర్పించడానికి ఉపయోగపడతాయి. నాసిరకం వస్తువులను విక్రయించిన వారిపై వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేయడానికి వెనుకాడొద్దు.

# బాబోయ్ కొత్త ఫోన్ల లో ముందే ఇన్స్టాల్ చేసిన యాప్స్ వెనుక ఇంత దారుణ మోసమా..!

### వీటిని అలాగే వదిలేస్తే జరిగేదిదే..!

**నెల్లూరు (మేజర్ న్యూస్)** కొత్త ఫోన్లు కొనడం ఇప్పట్లో అందరికీ అలవాటైపోయింది. కొందరు ప్యాషన్ కోసం ఫోన్లు పదే పదే మారుస్తూ ఉంటారు. మరికొందరు అవసరం కోసం కొంటూ ఉంటారు. ఫోన్ లు ఎలా కొన్నా సరే కొత్తగా కొన్న ఫోన్ లో ముందే కొన్ని యాప్స్ ఇన్స్టాల్ చేయబడి ఉంటాయి. వాటిలో చాలావరకు యాప్స్ ను డిలీట్ చేయడం కూడా కుదరదు. అందుకే చాలామంది వీటి గురించి పట్టించుకోకుండా అలాగే వదిలేస్తుంటారు. అయితే ఈ యాప్స్ వెనుక దారుణమైన మోసాలు జరుగుతున్నట్టు వార్తలు గుప్పుమంటున్నాయి. సాక్షాత్తూ స్మార్ట్ ఫోన్ సంస్థల సహకారంతోనే ఈ మోసాలు జరగడం ప్రజలను షాక్ కు గురిచేస్తోంది. అసలు కొత్త పోన్లలో ముందే ఇన్స్టాల్ చేయబడిన యాప్స్ వెనుక ఉన్న భాగోతం తెలుసుకుంటే.

ఓ పరిశోధన ప్రకారం చాలా కంపెనీ ఫోన్ లలో ప్రీ-ఇన్స్టాల్ చేసిన యాప్ లు వినియోగదారుల డేటాను తమ సర్వర్ లలో రహస్యంగా నిల్వ చేస్తున్నాయట. ఈ యాప్ లు స్క్రీన్ సైజ్, వెబ్ యాక్టివిటీ, ఫోన్ కాల్ లు, డివైజ్ ఐడెంటిఫైయర్ మొదలైన సమాచారాన్ని స్టోర్ చేస్తాయి. భారతదేశం




మాత్రమే కాకుండా ప్రపంచంలో ఉపయోగింపబడిన అన్ని రకాల ఫోన్లలో ఈ పరిశోధన చేసి ఈ విషయాన్ని స్పష్టం చేశారు. విచిత్రం ఏమిటంటే గూగుల్, ఫేస్ బుక్, మైక్రోసాఫ్ట్ యాప్ లు ఈ లిస్ట్ లో ఉండటం.

కొన్ని ఫోన్లలో ముందే ఇన్ స్టాల్ చేసిన యాప్ లను అన్ ఇన్స్టాల్ చేయడం కుదరదు. ముఖ్యంగా చవక ఫోన్లలో ముందే ఇన్స్టాల్ చేయబడిన యాప్స్ ఫోన్ లో యాప్ స్క్రీన్ వివరాలను కంపెనీలకు పంపుతాయి. అందులో ఫోన్ లో ఒక్కో యాప్ లో గడిపిన సమయం గురించి కూడా సమాచారం ఉంటుంది. ఈ డేటా ప్రపంచంలో నలుమూలల ఎన్నో దేశాలకు కూడా లీకవుతుండటం షాక్ కు గురిచేసే విషయం.ఇప్పట్లో కొనే స్మార్ట్ ఫోన్లలో ఫేస్ బుక్, అమెజాన్, గూగుల్, వాట్సప్, స్పాటిఫై వంటి యాప్ లు ముందే ఇన్స్టాల్ చేయబడి ఉంటున్నాయి. ఇవే కాదు ఫోన్లో ముందే ఇన్స్టాల్ చేయబడిన ఏ యాప్ అయినా దాన్ని వెంటనే అన్ ఇన్స్టాల్ చేసి ఆ తరువాత గూగుల్ ప్లే స్టోర్ నుండి యాప్స్ ను మళ్లీ ఇన్స్టాల్ చేసుకుని తర్వాత లాగిన్ కావడం మంచిది.